జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 7 పక్షపత్రిక ఏప్రిల్ 1-15, 2016



బాబాసాహెబ్ @ 125

దండలు, దండాలు సరే, అంబేద్కర్ ఆశించిన విద్య, ఆరోగ్యం, రాజ్యాంగ ప్రజాస్వామ్యం ఎక్కడ?




## ఇక లోక్‌సత్తా 2.0

ఎన్నికలకతీతంగా సంస్కరణల పోరు

# గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు



Evg. Dr. S. John David
Founder

*"Let your light so shine before men, that they may see your good works and glorify your Father in heaven." - Matthew 5:16*

## AMG INDIA INTERNATIONAL

H.O. Chilakaluripet - 522616, Guntur Dt. A.P., S.INDIA

Visit us : www.amg.in

*48 Years of Service to God & Mankind*

**1968 - 2016**



Rev. Dr. Arun Kumar Kanti Mohanty
President & Director

AMG stands for " **Advancing the Ministries of the Gospel**". AMG aims at the holistic development of **Body, Mind and Soul** of children/ persons/ communities belonging to socially/economically neglected/ marginalized/ downtrodden without discrimination of caste, religion or creed. AMG services including Education, Feeding, Clothing, Medical aid are FREE. Main VISION of AMG is to Empower/Facilitate/ Serve to uplift the living standards of Poor and Needy persons on par with the rich. AMG projects are located in states of Andhra Pradesh, Telangana, Odisha and Tamilnadu.

### Details of AMG Beneficiaries in different projects:



*Evg. Dr. S. John David receiving National Award for Child Welfare in 1995 from Dr. Shankar Dayal Sharma, Hon'ble President of India*

| S.No | Details | No.Of Beneficiaries |
|---|---|---|
| 01. | Child Care & Education | 14,400 |
| 02. | Milk Projects | 4,250 |
| 03. | Day Care Centres | 8,400 |
| 04. | Health Services | 35,000 |
| 05. | Technical Education | 3,000 |
| 06. | Disabled | 1,000 |
| 07. | Old Age Beneficiaries | 7,500 |
| 08. | Rehabilitation Activities | 12,500 |
| 09. | Leprosy Victims Rehabilitations | 5,000 |
| 10. | Community Workers | 2,000 |
| 11. | Children of Life Prisoners | 1,300 |
| 12. | Children of Suicide Farmers | 1,250 |
| 13. | Children of HIV/ AIDS Victims | 2,200 |
| 14. | Rations to HIV/AIDS Patients | 2,040 |
| 15. | Rations to Leprosy Victims | 3,000 |
| 16. | Rations to TB Victims | 6,000 |
| 17. | Limekiln workers | 1,000 |
| 18. | Ration to Blind people | 1,000 |
| 19. | Children of Blind Persons | 500 |
| 20. | Housing Helps | 50,500 |
| 21. | Drinking Water | 40,000 |
| 22. | Homes of Hope | 1,000 |
| 23. | Kalavanthulu | 1,000 |
| | Total No. of Beneficiaries | 2,03,840 |



*Rev. Arun Kumar Kanti Mohanty on 21-03-2015 receiving Telugu Ugadi Puraskar-2015 Award for Best Social Services from Sri. N.Chandrababu Naidu Hon'ble Chief Minister of AP.*

*AMG helping hand is providing emergency relief to Cyclone/Floods/Tsunami and Fire victims. Education Help to Children of Suicide Farmers, Prisoners, TB/HIV-AIDS/ Blind/ Leprosy patients.*

### Chilakaluripet Area

Chilakaluripet : AMG EM High School, AMG EM Jr. College, AMG EM Degree College, AMG Deichmann ITC, AMG B.Ed College, AMG Bible College, AMG-Dr.Satyavedam School of Nursing, Day Care Centres, Milk Projects, Free Health Clinics/ Hospitals, Old Age Homes, Monthly Free Ration distribution to TB, HIV/ AIDS, Blind and Leprosy victims, Polio Home, Homes of Hope. Narasaraopet: Sewing Centre, DCC for Old Age People, Milk Project. Chengizkhanpet: DCC cum EM School, Leprosy Rehabilitation Centre. Ganapavaram: TB. Chest Diseases Hospital, DCC for old women. Vadarevu: AMG Ichthus EM High School, Free Health Clinics, Ice-plant, Boats & Nets. Vijayawada : AMG Street Children Home. Piduguralla: DCC for Old Age People, Milk Project, DCC cum EM School for Children of Limekiln Workers.

### Visakhapatnam Area

Visakhapatnam : AMG Ruth Deichmann Hospital, Sewing Centres, Monthly Financial Help to Old People, Milk Projects, Monthly Rations to Leprosy/ HIV-AIDS/Blind victims, Literature Ministry, AMG-Dr. Satyavedam School of Nursing, Polio Home, Homes of Hope. Bheemili : AMG EM School, AMG EM Jr. College, AMG D.Ed College & AMG B.Ed College. Vizianagaram & Simhachalam: Leprosy Rehabilitation Centre, Free Health Clinic. Titlaghar(Odisha): Leprosy & TB Projects, Children Home, Help to Handicapped Children.

### Rajahmundry Area

Rajahmundry: AMG Day Care Centres, Free Health Clinic, Sewing Centres, Street Children Home, Homes of Hope, Monthly Rations to Leprosy Victims. Kadiyam: AMG Eye Hospital. Peddapuram: AMG Old Age Home, AMG Sewing Centre. Samalkot: Street Children Home. Rajavolu: AMG EM High School, AMG Eye Hospital. Bommuru: AMG EM High School, AMG EM Jr. College. Kakinada: AMG Sewing Centres, Day Care Centres, AMG EM School, Milk Project, Free Health Clinics, Old Age Home, Vocational Training Centre. Yeleswaram: HOD-AMG EM High School, Vocational Training Centre, DCC for Oldage people. Parimitadaka: AMG EM High School, Vocational Training Centre, Free Health Clinic.

AMG-Spiritual Services: Hope for India Conventions, Village Gospel Meetings, Newspaper Evangelism, Follow-up Work, Bible College, Area Conventions, Pulpit Helps, Retreat for Women & Youth Meetings.

జన రాజకీయం కోసం...
లోక్‌సత్తా టైమ్స్
పక్షపత్రిక ఏప్రిల్ 1-15, 2016
సంపుటి - 7 సంచిక - 7

## లోపలి పేజీల్లో...

దండలు, దండాలు సరే ............................ 5
సరైన ప్రమాణాలుంటేనే ప్రజాస్వామ్యం........... 8
నేనెందుకు బౌద్ధం వైపు ఆకర్షితుణ్ణయ్యాను..... 11
మానసాలు మారని వ్యవస్థలో ప్రజాస్వామం..... 13
ఇక లోక్‌సత్తా 2.0 ఎన్నికలలో పోటీకి దూరం. 16
"ఫోర్బ్స్" ప్రశంసలో లోక్‌సత్తా వాటా ఏది ....... 18
పలు ఎన్నికల, రాజకీయ సంస్కరణలను......... 19
అరచేతి స్వర్గం 'ఆదాయ భద్రత'.................. 21
ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2016-17.................... 23
తెలంగాణ బడ్జెట్ 2016 - 17.................. 25
ఏపీకి ప్రత్యేక హోదాపై నాటకాలాడుతున్న...... 27
హామీలు నెరవేర్చకుంటే పరిమితషాయే.......... 28
'వైవాహిక రేప్' పై మంత్రి మాట మార్చటం........ 29
మహిళల ఉపాధికి, దేశ ఆదాయానికి........... 31
పవర్‌స్టార్ ఈసారైనా సరైన లెక్కతో వస్తారా ?.. 32
నిజమైన విద్య, చట్టబద్ధపాలనతోనే ............ 33

సంపాదక వర్గం
డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం
బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# చరిత్రను సెల్ఫీలో బంధించలేం



సమాజాన్ని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చే శక్తి ఉన్న భావాలు, వాటి కోసం కృషి చరిత్ర అవుతాయి, మిగిలినదంతా ఒట్టి గతమే. ఈ వాస్తవిక అవగాహనతో అధికారాన్ని ఓ మార్గంగా గుర్తించినవారు, అధికారంలోకి వచ్చాక కూడా లక్ష్యాల మీదే దృష్టినిలిపి పనిచేసినవారు చరిత్రలో మిగిలిపోతారు. అధికారంలో ఉన్నప్పుడు చరిత్ర అంతా తన చుట్టూనే తిరుగుతుందనుకుని పెత్తనం చెలాయించి దోచుకున్నవారు.. పదవిలో నుంచి దిగిపోయాక గతంలో కలిసిపోయి ఫుట్‌నోట్స్‌గా మాత్రమే మిగిలిపోతారు. చరిత్రను సెల్ఫీలో బంధించటం సాధ్యం కాదు. అలాగే, ఏ కారణం చేతయినా కొంతకాలం అణచివేతకు గురయినా చరిత్రకు అర్థమైన కృషిని ఎవరూ ఆపలేరు. అలా చరిత్రకు అర్థమైన కృషి చేసిన మహనీయుడు కాబట్టే బాబాసాహెబ్ డా॥ బీఆర్ అంబేద్కర్‌ను జాతి అనివార్యంగా స్మరించుకుంటోంది. ఈ ఏడాది జరుపుకుంటున్న ఆయన 125వ జన్మదినోత్సవం ఓ మొక్కుబడి కాకూడదు. జాతీయస్థాయిలో ఎన్నో ఆశలతో, ఆకాంక్షలతో నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014లో ఎన్నికైంది. గడచిన కొన్ని దశాబ్దాలలో ఎవరికీ రాని గొప్ప అవకాశం మోదీకి వచ్చింది. ఆర్థికరంగంలో నిస్సందేహంగా ఆయన ప్రభుత్వం మంచి కృషి చేస్తోంది. కానీ అదొక్కటే సరిపోదు. జాతీయోద్యమం తర్వాత జాతినిర్మాణానికి అభివృద్ధి మంత్రమొక్కటి చాలు అనుకుంటే మనం ప్రజల ఆకాంక్షలకు అన్యాయం చేస్తున్నట్టే అవుతుంది. ఈవేళ్టి అభివృద్ధి మంత్రం వల్ల కేవలం 20శాతం మంది ప్రజలే ప్రయోజనం పొందుతున్నారు. ఈదేశ ప్రజల్లో కనీసం 80-90శాతంమందికి భాగస్వామ్యం, ఎదిగే అవకాశాలు లేకుండా 20శాతం మందికే ఉపయోగపడే కేంద్రీకృత అభివృద్ధి మంత్రాన్నే ఇంకా కొనసాగిస్తే, వేల ఏళ్ల వారసత్వంతో ఏదో బతికేస్తాంగానీ జాతి నిర్మాణం అసాధ్యమవుతుంది. విచ్ఛిన్నత ప్రమాదం పెరుగుతుంటుంది. చైనా, జపాన్ వంటి దేశాల ఆర్థిక వ్యవస్థల నుంచి నేర్చుకుంటున్న మన పాలకులు అక్కడ మెజారిటీ ప్రజలకు కల్పిస్తున్న భాగస్వామ్యం, అవకాశాల గురించి కూడా నేర్చుకోవాలి. ప్రజలందరికీ సమానావకాశాలను, అభివృద్ధి ఫలాలను అందించటానికి ఆర్థిక కృషితోపాటు అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించాలని మోదీ ప్రభుత్వం గుర్తించాలి. పాలనలో ఎక్కడికక్కడ భాగస్వాములయ్యేలా రాజ్యాంగాన్ని వికేంద్రీకరించి రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలి, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు ఇచ్చి వార్డు స్థాయికి పాలనను చేర్చాలి. అప్పుడే వివక్ష తొలగి, పౌరసత్వం, నాయకత్వం వికసించి అంబేద్కర్ ఆశించిన నిజమైన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం సాధ్యమవుతుంది. కేవలం రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగించటం, స్మారక కార్యక్రమాలు, దండలు, దండాల వల్ల బాబాసాహెబ్‌కి ఒరిగేదేమీ ఉండదు. నరేంద్ర మోదీ చేస్తున్నపాటి కూడా ప్రతిపక్షాలు చేస్తాయన్న ఆశ ప్రజల్లో లేకపోవటం వల్ల మోదీకి ఆదరణ కొనసాగుతుండవచ్చు. కానీ తాను ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ఆశలకు, ఇప్పటి కార్యాచరణకు చాలా అంతరముందని ప్రధానమంత్రి గుర్తించాలి. ఇప్పటికే చాలా సమయం వృథా అయింది. ప్రజలలో మోదీకి ఆదరణ ఉన్నా నమ్మకం సన్నగిల్లుతోంది. ఇకనైనా మోదీ ప్రభుత్వం మేలుకొని అభివృద్ధిని, అధికారాన్ని వికేంద్రీకరించి రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు మరిన్ని అధికారాలనిచ్చి విద్య, ఆరోగ్యం, ఆదాయావకాశాలు అందరికీ అందుబాటులోకి తేవాలి. ఈ సంస్కరణల్ని అమలుచేయకుంటే మోదీ, నితీష్ కుమార్‌లాంటి వాళ్లు కూడా విఫలమవుతారు, దేశసమగ్రత ప్రమాదంలో పడుతుంది, అంబేద్కర్‌లాంటి మహనీయుల ఆశయ సాధన అసాధ్యమైన లక్ష్యంగానే కొనసాగుతుంటుంది.




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. **10** ,
ఏడాది చందా : రు. **200**
మూడేళ్ళ చందా : రు. **500**

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# దండలు, దండాలు సరే,

## అంబేద్కర్ ఆశించిన విద్య, ఆరోగ్యం, రాజ్యాంగ ప్రజాస్వామ్యం ఎక్కడ?

ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించగానే కొందరు జాతి నిర్మాతలను తమవారిగా చేసుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. అన్నివర్గాలలో చొచ్చుకుపోయేందుకు కాంగ్రెస్ నుంచి గాంధీమార్కుని తీసుకునే ప్రయత్నం చేయటంతోపాటు వల్లభాయ్ పటేల్, బాబాసాహెబ్ అంబేద్కర్‌లకు పెద్దపీట వేశారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చేనాటికే అంబేద్కర్ దేశంలో అత్యంత ప్రాచుర్యం ఉన్న నాయకులలో ఒకరైనప్పటికీ ఆ నేతను బీజేపీతో కలిపిచూడటం చాలా తక్కువ. ఆలోటును పూడ్చుకుని, అణగారినవర్గాలలోకి చొరబడేందుకు మోదీ ప్రయత్నపూర్వక చర్యలు మొదలుపెట్టారు. అంబేద్కర్ విగ్రహాలకు దండలు వేయటం, దండాలు పెట్టటం, లండన్‌లో అంబేద్కర్ చదువుకున్న ఇంటిని కొనుగోలు చేయటం, స్మారకకేంద్రం ఏర్పాటు వంటి సంకేత చర్యలకు తోడు రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించటం, పార్లమెంటులో చర్చించటం, ఈ ఏడాది ఏప్రిల్ 14న బాబాసాహెబ్ డా॥ బీఆర్ అంబేద్కర్ 125వ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించటంలో భాగంగా ప్రత్యేక నాణేలు విడుదల చేయటం, సెమినార్లు నిర్వహించటం వంటివి చేశారు. పైవారు, కిందివారు అనే కుల సంస్కృతి గల హిందూత్వ భావజాలంగల తమలో కూడా అంబేద్కర్ భావాలు ప్రవహిస్తున్నాయని చెప్పేందుకు అంబేద్కర్‌ని ఐకాన్‌గా తీసుకున్నారు.




మంచిదే, అవసరం కూడా. కానీ అంబేద్కర్ అంటే ఒక విగ్రహం కాదు. మొక్కుబడులతో వశమయ్యే భావజాలం కాదు. ఒక సాధారణ స్థాయి వారు అంబేద్కర్ పట్ల గౌరవాన్ని, ఆయన భావాల పట్ల ఆమోదాన్ని వ్యక్తం చేస్తే అభినందించగలంగానీ, ఒక ప్రభుత్వ స్థాయిలో, అందులోనూ సమీప దేశచరిత్రలోనే అసాధారణ మెజారిటీతో ఎన్నికైనా మోదీ ప్రభుత్వం నుంచి మొక్కుబడి స్థాయికి మించి చాలా చేయాల్సుంది. సాధారణ పౌరులు, పౌరసమాజం, ప్రతిపక్షంలోనివారిలాగా మోదీ నీతివాక్యాలు, ప్రకటనలకే పరిమితమయ్యే స్థాయిలో లేరు. ఆయన చేతిలో అధికారముంది. వేగంగా, విస్తృతస్థాయిలో మార్పును తేగల అవకాశముంది. అంబేద్కర్‌ని ఐకాన్‌గా మోదీ ప్రభుత్వం, పార్టీ తీసుకోగానే ఇన్నేళ్లపాటూ అంబేద్కర్ పట్ల మొక్కుబడిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ కూడా బాబాసాహెబ్ జయంతి ఉత్సవాలను ఏడాది పాటి నిర్వహించటం మొదలుపెట్టింది. సమాజంలో కొంత స్పందన మొదలైంది.

కానీ దండలు, దండాలు, సెమినార్లు, నాణేలు వగైరాలకు మించి అంబేద్కరిజంపై మోదీ స్పందించగలుగుతున్నారా? తన పరిపాలనతో అంబేద్కరిజాన్ని ఆచరణలో చూపుతున్నారా? అదీ ఈ బాబాసాహెబ్ 125వ జన్మదినోత్సవ సందర్భానికి నిజమైన ప్రశ్న.

ఈ ప్రశ్నకు సమాధానం చాలా నిరాశను కలిగిస్తుంది. అంబేద్కర్ చాలా ప్రాధాన్యత ఇచ్చిన రంగం విద్య. అణగారినవర్గాలు ఎదగాలంటే ముందు అధ్యయనం ఉండాలి అని నిరంతరం చెప్పేవారు. అధ్యయనం నుంచి మీరు వ్యక్తులుగా ఎదగగలగటంతోపాటు నాయకులుగా కూడా మారతారు అని బోధించేవారు. అణగారినవర్గాలకు ఆత్మవిశ్వాసాన్ని, సమాజంలో స్థానాన్ని కల్పించటానికి అంబేద్కర్ ప్రభుత్వరంగంలో రిజర్వేషన్లను ప్రతిపాదించారు. ఇందుకోసం వారిని షెడ్యూల్డ్ కులాల కింద సంఘటితం చేశారు. కానీ ఈ రిజర్వేషన్లనే ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఓటు బ్యాంకులను తయారుచేసుకునే ఆయుధాలుగా వాడుకుంటూ స్వార్థ రాజకీయాల కోసం శాశ్వతంగా కొనసాగిస్తారని ఆనాడాయన ఊహించలేదు. ప్రజలందరికీ స్వతంత్ర భారత ప్రభుత్వం మంచి చదువును (గుమాస్తాలను తయారుచేసే చదువును కాదు ఆయనడిగింది) అందిస్తుందని విశ్వసించారు. అందుకే రిజర్వేషన్లను పరిమిత ప్రయోజనకరమైన తాత్కాలిక ఉపశమనం కింద భావించి కాలపరిమితి విధించారు. కానీ మంచి చదువూ అందలేదు, రిజర్వేషన్ల అవసరమూ తీరలేదు. మంచి చదువు లేకపోవటం వల్ల రిజర్వేషన్లలో అవకాశాల్ని కూడా అణగారినవర్గాలు అందుకోలేని దుస్థితిని ప్రభుత్వాలు కల్పించాయి.

విద్యతోపాటు ఆరోగ్యాన్ని అందించాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోవటం వల్ల అణగారిన వర్గాలే తీవ్రంగా నష్టపోయారు. వారిలో పేదరికం నిరంతరం కొనసాగటంతో

పాటు చదువుకునే, పనిచేసే సామర్థ్యం కూడా కుంటుపడింది. ఒక కుట్ర పన్నినట్టు విద్య, ఆరోగ్యం అందకుండా చేసి ప్రభుత్వాలు అంబేద్కర్ ఆశయాలకు ద్రోహం చేస్తే, నరేంద్ర మోదీ అందుకు భిన్నమైన మార్గంలో ఏమీ వెళ్లటం లేదు. (ఎన్నికల సంవత్సరాన్ని మినహాయిస్తే) దాదాపు సగం పదవీకాలాన్ని మోదీ ప్రభుత్వం పూర్తిచేసుకున్నా విద్య, ఆరోగ్య రంగాల గురించిన నిర్మాణాత్మక చర్చ ఇప్పటిదాకా దాదాపు శూన్యం. ఓఈసీడీ 74 దేశాల ఉన్నత పాఠశాల మధ్య జరిపిన సర్వేలో భారత్‌కి 73వ స్థానం రావటానికి ప్రధాన కారణం మన విద్యార్థుల్లో లెక్కలు, తర్కం, విశ్లేషణ వంటి సామర్థ్యాలు తక్కువగా ఉండటమే. యువత వ్యక్తిగత అభివృద్ధికి, దేశానికి నిజంగా పనికొచ్చే ఈ సామర్థ్యాలకు 'చరిత్ర పే చర్చా' పేరుతో విద్యాసంస్థల్లో లేవనెత్తుతున్న వివాదాలకు సంబంధం లేదు. లెక్కలు, తర్కం, విశ్లేషణ ఇవన్నీ ప్రపంచ వ్యాప్తంగా ఒకటే. ఏ దేశమేగినా రెండొకట్లు రెండే. అలాగే శాస్త్ర పరిశోధనలు, ఫలితాలు ఎక్కడైనా ఒకటే. ఐన్‌స్టీన్ సిద్ధాంతమో, లూయీ పాశ్చర్ ఔషధమో చెప్పాలంటే ఏ దేశంలోనైనా ఒకే విషయం చెప్పాలి. అందుకే నిజంగా చదువును బాగు చేయాలనుకుంటే ఎటువంటి వివాదాల జోలికి పోకుండానే మోదీ ప్రభుత్వం చాలా చేసే ఉండొచ్చు. కానీ హెచ్‌ఆర్‌డీ మంత్రి నియామకం నుంచి కూడా ఈ దేశ భవిష్యత్తును నిర్మించటంలో అతి ముఖ్యమైన చదువు గురించి కనీస అవగాహన, ఆసక్తి లేనట్టు మోదీ సర్కారు వ్యవహరిస్తోంది. కేవలం డబ్బుండి, గట్టిగా పట్టించుకునే 10-20శాతానికి తప్ప ఈదేశంలో మిగిలిన ప్రజలకు సరైన చదువు ఈ దేశంలో అందదు. సరైన చదువు లేకపోవటం, ఫలితంగా నైపుణ్యాలు కొరవడటం వల్ల చాలామంది మెరుగైన ఆదాయాలకు దూరమవుతున్నారు. దీంతో, తరతరాలుగా తమకు సమాజం చేసిన అమానుష నష్టానికి కొంతైనా పరిహారంగా రిజర్వేషన్లు పొందుతున్న వారి పట్ల చాలామందిలో అసూయాద్వేషాలు రగులు తున్నాయి.

అలాగే ఆరోగ్యరంగంలో ప్రపంచంలో చెప్పుకోదగిన దేశాలన్నిటికన్నా అథమస్థాయిలో మనదేశం ఉంది. యూపీయే ప్రభుత్వం కంటే ఎక్కువ నిధులిచ్చి ఆరోగ్యమిస్తామని హామీ ఇచ్చిన మోదీ, గెలిచాక ఆ రంగాన్నే పట్టించుకోవటం లేదు. జీడీపీలో 1.2శాతం కేటాయించారు. జేబులో నుంచి దాదాపు 3లక్షల కోట్లను ఈదేశ ప్రజలు వైద్య, ఆరోగ్య సేవల కోసం ఖర్చు చేస్తున్నారని ఓ అంచనా. ఆసుపత్రుల్లో చేరటం వల్ల అయ్యే ఖర్చుల వల్లే 20-30శాతం మంది పేదరికంలోకి జారిపోతున్నారు. వీరిలో అణగారిన వర్గాలే ఎక్కువని వేరే చెప్పనక్కర్లేదు. ఉన్న బీమా సదుపాయాలు వ్యాధి ముదిరాక కొంత ఉపయోగపడుతున్నా ఫలితాలు చాలా తక్కువగా వస్తున్నాయి. ప్రాథమిక, రెండోదశ వైద్యసదుపాయాలు ప్రభుత్వ పరంగా లేకపోవటం పేద, మధ్యతరగతివారి పనిసామర్థ్యం మీద తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. చౌకగా అందుబాటులో ఉండే ప్రత్యామ్నాయ వైద్యాలకు వెళ్లండని మోదీ ఉచిత సలహాలాగా చెబుతున్నారు.




అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణ సారథి అని చాలామందికి తెలుసు. ఆ రాజ్యాంగాన్ని ఆయన మొక్కుబడి అసైన్‌మెంట్‌లాగా, తప్పనిసరి తంతులాగా రాయలేదు. ఈదేశంలో నిజమైన గణతంత్ర వ్యవస్థను నిర్మించ గలిగేదిగా రూపొందించారు. ప్రతి అక్షరం వెనకా, అందరికీ ఎదిగే అవకాశాలున్న భారతదేశం కోసం ఆయన కలలు, తపన ఉన్నాయి. స్వతంత్ర పోరాట కాలంలో వలసపాలకుల మీద పోరాటాలకు ఉపయోగించిన హర్తాళ్లు, సమ్మెలు, రాస్తారోకోలు వంటివి ఇక అక్కర్లేకుండా ప్రజలను సార్వభౌములుగా నిలపగలిగే గొప్ప రాజ్యాంగాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు అంబేద్కర్ ప్రకటించారు. కానీ ఆ రాజ్యాంగ లక్ష్యాన్ని, స్ఫూర్తిని నీరుగార్చటంలో మోదీ ప్రభుత్వం కూడా భాగస్వామిగా మారింది.

చట్టం ముందు అందరూ సమానమే అనే పరిస్థితి ఏమాత్రం మెరుగవలేదు. ఏరకమైన ఆహారం తినాలో కూడా నిర్ణయిస్తూ దాడులకు పాల్పడుతున్నా చట్టం నిరోధించలేకపోతోంది. ఢిల్లీ జేఎన్‌యూ వివాదంలో కోర్టు ఆవరణలో నిందితునిపై కొందరు న్యాయవాదులే దాడులకు పాల్పడితే పోలీసులు మౌన ప్రేక్షకుల్లా వ్యవహరించినా ప్రభుత్వం పరోక్షంగా ప్రోత్సహిస్తున్నట్టు ఉదాసీనంగా వ్యవహరించింది. పోలీసు నియామకాల్లో రాజకీయ జోక్యం యధేచ్ఛగా కొనసాగుతోంది. ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్యదేశంలోనూ లేనివిధంగా జడ్జీలను జడ్జీలే నియమించుకునే విధానాన్ని మార్చి ఉన్నత న్యాయమూర్తుల

నియామకంలో పారదర్శకత కోసం లోక్‌సత్తా 14ఏళ్లపాటు కృషి చేసి వివిధ రాజకీయ పార్టీలను ఒప్పించి 'జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్' చట్టాన్ని సాధించగలిగితే, ఆ చట్టాన్ని కొట్టివేస్తున్నట్టు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, అప్రజాస్వామికంగా కొట్టివేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించినప్పుడు మోదీ ప్రభుత్వం సరిగా స్పందించలేకపోయింది. పార్లమెంటు రాజ్యాంగసభలా వ్యవహరించి విస్తృత చర్చ చేయాలని, ప్రపంచ న్యాయ కోవిదులను కూడా ఆహ్వానించి వ్యవస్థల మధ్య స్పష్టమైన పరిధుల్ని పునర్నిర్వచించాలని లోక్‌సత్తా ప్రామాణిక పరిష్కారాన్ని సూచించినా మోదీ స్పందించలేకపోయారు. దేశంలో మోదీ సర్కారు వెంటనే విప్లవాత్మక మార్పుల్ని తేవాలని ఆశించలేంగానీ, ఆ దిశగా ప్రయత్నాలు చాలా పేలవంగా ఉన్నాయి.

ముఖ్యంగా వ్యవస్థలు, వ్యవస్థీకృత మార్పులు పెద్దగా అక్కర్లేదు అనే రీతిలో కేంద్రీకృత పాలన చేయటం అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగ లక్ష్యాలను బలహీనపరుస్తుంది. అలాగే బ్రిటీషు వారసత్వంగా వచ్చిన ప్రభుత్వాధికారుల ఆధిపత్య ధోరణుల వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీ పనులకు ప్రజలు లంచాల్ని, వేధింపుల్ని, అవమానాల్ని ఎదుర్కొంటున్నా మోదీ సరైన రీతిలో స్పందించలేదు. దీనివల్ల రాజ్యాంగం ప్రకారం ప్రభువులుగా ఉండాల్సిన ప్రజలు సేవకులుగా మారిపోయారు, సేవకులుగా ఉండాల్సిన ప్రభుత్వోద్యోగులు యజమానుల్లా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌరసేవలను అందించేందుకు లోక్‌సత్తా రూపొందించిన 'సర్వీస్ గ్యారంటీ చట్టం' పార్లమెంటు ముందున్నా మోదీ కాలయాపన చేస్తున్నారు.

ఇవన్నీ అంబేద్కర్ చెప్పిన రాజ్యాంగ లక్ష్యాల్ని సాధించే కొన్ని చర్యలు మాత్రమే. అంబేద్కర్ చెప్పని, వాయిదావేసిన రాజ్యాంగ లక్ష్యాలు కొన్ని ఉన్నాయి. అందులో ప్రధానమైనది అధికార వికేంద్రీకరణ. ఆనాడు దేశ విభజన భయానక పరిస్థితుల్లో అంబేద్కర్, ఇతర జాతీయ నాయకులు కేంద్రీకృత పాలనకు తగ్గట్టు రాజ్యాంగాన్ని రూపొందించారు. ఇప్పుడు ఫెడరల్ వ్యవస్థ బలపడిందికాబట్టి, మారిన పరిస్థితులకనుగుణంగా అధికారాన్ని ఢిల్లీ నుంచి, రాష్ట్ర రాజధానుల నుంచి వార్డు స్థాయికి వికేంద్రీకరించాలి. ఇప్పుడు ఈ సంస్కరణ తీసుకురాకపోతే అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం సాధ్యం కాదు.

అంబేద్కర్ పట్ల ఎంత భక్తిభావాన్ని ప్రదర్శిస్తున్నా అంతకుముందు ప్రభుత్వాలు, సమాజంలోని పలు సంస్థల వలే ఆయన్ని కేవలం అణగారినవర్గాల నాయకుడిగానే ప్రభుత్వం భావిస్తున్నట్టు కనిపిస్తోంది. ఆ వ్యవహారశైలి ఎంతమాత్రం సరికాదు. కుల వివక్ష కారణంగా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ జీవితకాలంలో చాలా సమయం వెచ్చించారన్నది వాస్తవం. కానీ ఆయన ఈదేశ నిర్మాణంలో భాగంగానే అంతటి మహాప్రయత్నాన్ని చేశారనటంలో సందేహం లేదు. వ్యక్తిగతంగా కాకుండా వ్యవస్థీకృతంగా ఆయన కులవివక్ష మీద పోరాడారు. అందుకే అంబేద్కర్‌ని కేవలం దళితుల నాయకుడిగా చూస్తే, ఆయన స్థాయిని, తద్వారా మనస్థాయిని కించపరచుకున్నట్టే. విద్య, ఆరోగ్య రంగాలలో అంబేద్కర్ ఆశించిన సంస్కరణలు అందరికీ మేలు చేసేవి. అంబేద్కర్ పట్ల నిజమైన ప్రేమ, భక్తి ఉంటే, మోదీ తక్షణం విద్య, ఆరోగ్యం రంగాలను సంస్కరించాలి, రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని నిర్మించటానికి రాజీలేకుండా వ్యవహరించాలి. అర్హులకు రిజర్వేషన్లను అందించటంతోపాటు, అందరికీ నాణ్యమైన విద్యను అందించే ఏర్పాటు చేయాలి. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యాన్ని ఒక హక్కుగా అందించాలి. భావప్రకటనా స్వేచ్ఛను, బహుళత్వ విలువల్ని పరిరక్షించాలి, సర్వీస్ గ్యారంటీ చట్టం తేవాలి. మన రాజ్యాంగంలో ఉన్న ఉదాత్త విలువలకు తగ్గట్టు వ్యవస్థ తయారవటానికి వీటితోపాటు దామాషా ఎన్నికల వ్యవస్థను తెచ్చి ఓటుహక్కు సద్వినియోగమయ్యేలా చర్యలు తీసుకోవాలి. అధికారాన్ని వికేంద్రీకరించాలి. ఫిరాయింపులకు కళ్లెం వేసే చట్టాన్ని తేవాలి. ముఖ్యమంత్రులకు ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావాలి. ఈ మాత్రం చేసినా నరేంద్ర మోదీ అంబేద్కర్ లక్ష్యం దిశగా ఎంతో చేసినవారవుతారు. వీటిలో అరకొరగా వ్యవహరిస్తూ అంబేద్కర్ మా దైవం అంటే తాత్కాలిక ప్రచారం రావొచ్చేమోగానీ దీర్ఘకాలంలో మోదీ పార్టీతో సహా ఎవరికీ ఒరిగేదేమీ ఉండదు.


మరోవైపు, అధికారంలో ఉన్నారు కాబట్టి మోదీకి ఎక్కువ బాధ్యత ఉంటుందిగానీ, ఈ లక్ష్యాల దిశగా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీకి, పౌరసమాజానికి, ఎక్కడికక్కడ పౌరులకు కూడా ఉంటుంది. విశ్వవిద్యాలయ అధ్యాపకుడు గాలి వినోద్ కుమార్ అణగారిన వర్గాల నుంచి వచ్చి వారి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తూ ఇటీవల వరంగల్ లోక్‌సభ ఉప ఎన్నికలో పోటీచేశారు. అంబేద్కర్‌వాదులమని చెప్పుకునేవారెవ్వరూ చెప్పుకోదగిన సాయం అందించకపోవటం ఆయనకు దిగ్భ్రాంతి కలిగించింది. దళిత నేతలు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించటం పట్ల ఆయన ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ కృషి వల్ల అవకాశాలు పొందినవారు, రాజ్యాంగ ఛత్రంలో రక్షణ పొందుతున్నవారే ఆయన ఆశయాలను నీరుగారుస్తుంటే ఇక అంబేద్కరిజం ఎలా సాకారమవుతుంది?

బాబాసాహెబ్ 125వ జన్మదిన సమీక్ష ఈదేశంలో కొన్ని మౌలిక మార్పులకైనా నాంది పలకాలి. ■

# సరైన ప్రమాణాలుంటేనే ప్రజాస్వామ్యం

**- డా॥ బీఆర్ అంబేద్కర్**

ప్రజాస్వామ్యం అనేది సంక్షోభంలో చిక్కుకోకుండా విజయవంతంగా పనిచేయాలంటే కొన్ని ప్రమాణాలను పాటించాలి. ఈ అంశం గురించి చర్చించే ముందు కొన్ని ప్రాథమిక సూత్రాలను గమనంలోకి తీసుకోవటం అవసరం. మొదటిది: ప్రజాస్వామ్యం ఎప్పుడూ ఒకే తీరులో ఉండదు. ప్రజాస్వామ్య భావన ఎప్పటికప్పుడు స్థాయిలో మార్పు చెందుతూ వస్తుంటుంది. ఉదాహరణకు గ్రీకుల అథీనియన్ ప్రజాస్వామ్యం వేరు. ఇప్పటి మన ప్రజాస్వామ్యం వేరు. నాటి గ్రీకు సమాజంలో సగం మందే పౌరులు. మిగిలిన సగం బానిసలే. బానిసలకు ఎటువంటి రాజకీయ హక్కులు ఉండవు. మన ప్రజాస్వామ్యం ఇందుకు పూర్తిగా భిన్నమైనది. రెండవ అంశం: ప్రజాస్వామ్యం ఒకే దేశంలో కూడా ఒకే రకంగా ఉండదు. ఇంగ్లండ్ చరిత్రనే తీసుకుంటే, 1688 విప్లవం ముందు ప్రజాస్వామ్యం వేరు, తదనంతరం వేరు. మళ్లీ 1832 చట్టం తర్వాత ప్రజాస్వామ్యం లక్షణంలోనే కాదు లక్ష్యంలో కూడా మార్పు వస్తుందని మనం గమనించాల్సిన మూడవ విషయం. పురాతన ఇంగ్లిష్ ప్రజాస్వామ్యాన్ని గమనిస్తే లక్షణంలో, లక్ష్యాలలో మార్పు కనిపిస్తుంది. రాజు నిరంకుశ అధికారాన్ని అడ్డుకోవడానికి ప్రజాస్వామ్య చర్యలు అవసరమయ్యాయి.



మరి ఈరోజు ప్రజాస్వామ్యం లక్ష్యం ఏమిటి? ప్రజాసంక్షేమమే ఈనాటి ప్రజాస్వామ్య ప్రధాన కర్తవ్యం. ఇది ప్రజాస్వామ్య భావనలో వచ్చిన బలీయమైన మార్పు.

ప్రజాస్వామ్య భావనలో వచ్చిన మార్పులు సరే, ఇంతకీ ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? రాజనీతి కోవిదులు, చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు అనేకమంది అనేకరకాలుగా ప్రజాస్వామ్యాన్ని నిర్వచించారు. మనం రెండు ప్రఖ్యాత నిర్వచనాలను తీసుకుందాం. వాల్టర్ బెగాట్ ఆధునిక ప్రజాస్వామ్యాన్ని "చర్చల ద్వారా ప్రభుత్వం" అని నిర్వచించారు. ఇక అబ్రహాం లింకన్ ఇచ్చిన నిర్వచనం చాలామందికి తెలిసిందే. "ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల యొక్క ప్రభుత్వమే ప్రజాస్వామ్యం". నా దృష్టిలో ప్రజాస్వామ్యం అంటే "రక్తపాతరహితంగా ప్రజల ఆర్థిక, సామాజిక జీవితాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చే ప్రభుత్వ వ్యవస్థ". ప్రభుత్వం వివిధ

**ఒకప్పుడు అమెరికాలో కూడా కూడా ఇలాంటి విషాదకర పరిస్థితే ఉండేది. కానీ దీని వల్ల ప్రజాస్వామ్యం పతనమవుతుందని గ్రహించి ప్రభుత్వాల్ని, ఉద్యోగుల్ని ముడిపెట్టే విధానానికి స్వస్తి చెప్పారు. గ్రేట్ బ్రిటన్‌ను ఈ విషయంలో ఆదర్శప్రాయంగా చెప్పుకోవచ్చు. స్వచ్ఛమైన పాలన ఉండాలంటే ప్రభుత్వం ఉద్యోగస్తుల విధినిర్వహణలో జోక్యం చేసుకోకూడదని వారు ఖచ్చితంగా విశ్వసిస్తారు, పాటిస్తారు. బ్రిటీష్ ఇండియాలో కూడా ఇదే పద్ధతి అమలులో ఉండేది. ప్రభుత్వం పాలసీలను రూపొందించవచ్చు,**

రంగాలలో ప్రవేశపెట్టే మార్పును ప్రజలు శాంతియుతంగా ఆమోదిస్తే ప్రజాస్వామ్యం ఉన్నట్టే. ప్రజామోదమే ప్రజాస్వామ్యానికి గీటురాయి. ఈ ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయాలంటే ఎటువంటి పరిస్థితులు ఉండాలి అన్నదే ఇప్పుడు మన ముందున్న విషయం. ఫలానా సూత్రాలను అనుసరిస్తే ప్రజాస్వామ్యం విజయవంతంగా నడుస్తుందని ఇంతవరకూ ఏ శాస్త్రకారుడూ రాయలేదు. మనకు మనంగా చరిత్రను అధ్యయనం చేసి ప్రజాస్వామ్య సాఫల్య, వైఫల్య పరిస్థితులను అర్థం చేసుకుని స్థూలంగా నిర్ణయాలు చేసుకోవాలి.

ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే ఉండాల్సిన మొదటి షరతు- సమాజంలో ఎటువంటి అసమానతలు ఉండకపోవటం. అణచివేతకు గురయ్యే వర్గం ఉండకూడదు. పల్లకీ ఎక్కేవాళ్లు, పల్లకీ మోసేవాళ్లు ఉన్న సమాజంలో ప్రజాస్వామ్యం వికసించదు. ఇంత హెచ్చుతగ్గులు ఉన్న సమాజంలో రక్తపాత విప్లవానికి ఎప్పుడూ అవకాశాలు ఉంటాయి. మనం ముక్కచెక్కలుగా ఉంటే ప్రజాస్వామ్య సౌధం కూలిపోతుందని లింకన్ మహాశయుడు హెచ్చరించారు. వర్గం, కులం వంటి విభేదాలు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తాయి. అణచివేసే, అణచివేతకు గురయ్యేవారి మధ్య అగాధం పెరిగినకొద్దీ ప్రజాస్వామ్యం కుప్పకూలుతుంది. సామాజిక అసమానతల వల్ల ప్రజాస్వామ్యం విఫలమైన ఉదాహరణలు చరిత్రలో కోకొల్లలు.

ప్రజాస్వామ్యం క్రమబద్ధంగా పనిచేయడానికి అవసరమైన రెండవ కీలకాంశం- ప్రతిపక్షాల ఉనికి. ప్రజాస్వామ్యంలో పార్టీ పద్ధతి గురించి పెద్ద చర్చే జరుగుతోంది. మాట వరసకు అడుగుతున్నాను- అసలు ప్రజాస్వామ్యం పనితీరు ఏమిటి? ఇది ఒక రకమైన వీటో అధికారం. నియంతృత్వ, ఏకపక్ష నిర్ణయాలను అడ్డుకునే అధికారాన్ని కలిగి ఉండటమే ప్రజాస్వామ్యం. అయిదేళ్లకొకసారి తమ దగ్గరికొచ్చే ప్రతినిధులను తొలగించాలా, తిరిగి ఎన్నుకోవాలా? అన్నది నిర్ణయించుకునే అధికారం ప్రజల చేతుల్లో ఉంటుంది. అంటే ప్రజల చేతుల్లో వీటో అధికారం ఉంటుందన్న మాట. ప్రభుత్వ నిర్ణయాలను ఎప్పటికప్పుడు సవాలు చేయటానికి, అవసరమైతే తిప్పికొట్టటానికి ప్రతిపక్షం ఉంటేనే ఇది సాధ్యపడుతుంది. తన పార్టీకి చెందని సభ్యులకు జవాబుదారీగా ఉండాల్సిరావటంతో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే దీనికి సంబంధించి భారతదేశంలో పరిస్థితులు అపసవ్య దిశలో ఉన్నాయి. వ్యాపార ప్రకటనల కోసం మన పత్రికలు ప్రభుత్వ కార్యక్రమాలకు ఎక్కువ ప్రచారం ఇస్తున్నాయి. ప్రతిపక్షాల నుంచి ఎక్కువ రాబడి రాదు కదా! అధికార పార్టీ సభ్యుల ఉపన్యాసాలను మొదటి పేజీలలోను, ప్రతిపక్షాల వారి ప్రకటనలను మూలల్లోనూ ప్రచురిస్తుంటారు. ఇది ప్రజాస్వామ్యానికి క్షేమం కాదు. ఇంగ్లండ్, కెనడాలలో పరిస్థితి చాలావరకు మెరుగ్గా ఉంటుంది. ప్రతిపక్షాల విలువను అక్కడ బాగా గుర్తిస్తారు. దీనివల్ల ప్రజాస్వామ్యం సాఫీగా పనిచేస్తుంది.

ప్రజాస్వామ్యం సజావుగా పనిచేయాలంటే అనివార్యంగా ఉండాల్సిన మూడవ అంశం-చట్టసమానత్వం. ప్రభుత్వ వ్యవహారాలలో చట్టసంబంధ వ్యవహారాలలో ఎవరికీ మినహాయింపు ఉండకూడదు. చట్టం ముందు సమానత్వం కేసులు అక్కడక్కడా కన్పించవచ్చు. కానీ ప్రభుత్వ లావాదేవీలలో ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి తాండవం చేస్తున్నాయి. తన పార్టీవాళ్లు, తన సొంతవాళ్లు అనుకున్నవారి కోసం నిబంధనలకు నీళ్లదిలిన సంఘటనలు లెక్కకు మించి ఉన్నాయి. ఏ రంగు టోపీ పెట్టుకున్నాడో చూసి లైసెన్సులు గ్రాంట్ చేసే దౌర్భాగ్యులు అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఉన్నారు. ఒకప్పుడు అమెరికాలో కూడా కూడా ఇలాంటి విషాదకర పరిస్థితే ఉండేది. కానీ దీని వల్ల ప్రజాస్వామ్యం పతనమవుతుందని గ్రహించి ప్రభుత్వాల్ని, ఉద్యోగుల్ని ముడిపెట్టే విధానానికి స్వస్తి

చెప్పారు. గ్రేట్ బ్రిటన్‌ను ఈ విషయంలో ఆదర్శప్రాయంగా చెప్పుకోవచ్చు. స్వచ్ఛమైన పాలన ఉండాలంటే ప్రభుత్వం ఉద్యోగస్తుల విధినిర్వహణలో జోక్యం చేసుకోకూడదని వారు ఖచ్చితంగా విశ్వసిస్తారు, పాటిస్తారు. బ్రిటీష్ ఇండియాలో కూడా ఇదే పద్ధతి అమలులో ఉండేది. ప్రభుత్వం పాలసీలను రూపొందించవచ్చు, కానీ పరిపాలనావిధానంలో జోక్యం చేసుకోకూడదన్నది ప్రజాస్వామ్య మౌలికసూత్రాలలో ఒకటి. ఈరోజు మనదేశం ఈ విషయంలో గాడితప్పింది. దీనివల్ల అనేక కుంభకోణాలు చోటుచేసుకోవటమేకాక ప్రజాస్వామ్యం మీద నమ్మకం సడలిపోతుంది.

రాజ్యాంగ నైతికతను గుర్తించటం ప్రజాస్వామ్య విజయానికి మరో కీలక అంశం. మనదేశంలో రాజ్యాంగం గురించి మాట్లాడేవాళ్లకు కొదవలేదు. మౌలిక విలువలు పాటించకపోతే రాజ్యాంగం చిత్తుకాగితం పాటి విలువ చేయదన్న వాదనతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. లిఖిత రాజ్యాంగం లేని ఇంగ్లండ్‌లో కేవలం ఈ విలువలను పాటించటం వల్ల వ్యవస్థ నడుస్తున్నది. మనకంటే ఎన్నోరెట్లు మెరుగైన పాలనను వాళ్లు అందుకోగలిగారంటే నైతిక విలువలే కారణం. ఇక్కడ ఒక మంచి ఉదాహరణ చెబుతాను. వాషింగ్‌టన్ అమెరికన్‌ల ఆరాధ్యదైవం. అమెరికన్‌లు రాజ్యాంగం రాసుకున్న తర్వాత మొదటి అధ్యక్షుడు వాషింగ్‌టన్. తన పదవీకాలం పూర్తయిన తర్వాత తిరిగి అధ్యక్ష పదవికి నిలబడటానికి ఆయన నిరాకరించారు. వాషింగ్‌టన్ కోరుకుంటే ఎన్నిసార్లు నిలబడితే అన్నిసార్లు అధ్యక్షుడవుతారు. కానీ ఆయన అలా చేయలేదు. వ్యక్తి ఆరాధన ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని చివరకు విలువలు పతనమవుతాయని హెచ్చరించారు. అందరి బలవంతం మీద రెండోసారి అధ్యక్షుడైనా మూడోసారి మాత్రం అధ్యక్ష పదవిని వాషింగ్‌టన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అదీ నైతికత అంటే. అలాగే ఇంగ్లండ్ విషయంలో నైతిక విలువల గురించి మనం అనేక ఉదాహరణలు చెప్పుకోవచ్చు. విలువలను కాపాడటం కోసం అధికారాన్ని తృణీకరించిన ఆంగ్లేయ నాయకులు అనేకమంది ఉన్నారు.

అలాగే మైనారిటీ మీద మెజారిటీ పెత్తనం చెలాయించే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు. ఇంగ్లండ్‌లో 1931 ఎన్నికలను ఇక్కడ ఉదాహరణగా ప్రస్తావించవచ్చు. 650 మంది సభ్యులు గల కామన్స్ సభలో 50మంది మాత్రమే లేబర్ పార్టీ సభ్యులు ఉన్నారు. ఎన్నోరెట్లు ఎక్కువ ఉన్నా కన్జర్వేటివ్ పార్టీ సభ్యుల ముందు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించగలిగారు. ఫలానా సందర్భంగా మమ్మల్ని కన్జర్వేటివ్ పార్టీ మాట్లాడనీయలేదు అనే ఆరోపణను నేను ఎప్పుడూ లేబర్ పార్టీ వారి నుంచి వినలేదు (ఆ సమయంలో నేను ఇంగ్లండ్‌లో ఉన్నాను). సంఖ్యాబలం లేని పార్టీ సభ్యుల ప్రతిపాదనల మీద స్వేచ్ఛగా చర్చించే అవకాశం కల్పించాలి. మైనారిటీల అభిప్రాయాలను పార్లమెంట్‌లో అణగదొక్కితే వాళ్లు రాజ్యాంగేతర మార్గాలను అనుసరిస్తారు.

మనం మరువకూడని మరో అంశం– అన్యాయానికి స్పందించే లక్షణం! నలుపైనా, తెలుపైనా, ఆడయినా, మగయినా, నిమ్న అయినా, అగ్ర అయినా అన్యాయం జరిగితే స్పందించి ముందుకు ఉరకటం అనేది ప్రజాస్వామ్య భావనను ఉద్దీపింప చేస్తుంది. దక్షిణాఫ్రికాలో నల్లవారికి జరిగే అన్యాయాలకు స్పందించి పోరాడే శ్వేతజాతీయులు ఉన్నారు. మనదేశంలో దక్షిణాఫ్రికాగా పేర్కొనదగిన వేలాది పల్లెలు ఉన్నాయి. కానీ దళితుల కోసం ఆరాటపడి పోరాడే అలాంటివారు ఇక్కడ దాదాపు లేరు. ఎందుకంటే, అంతరంగిక చైతన్యం, స్పందన ఇక్కడ కొరవడుతోంది.

ప్రజాస్వామ్యం గురించి ప్రాథమిక స్థాయిలో అవకాశమున్నంత మేరకు చర్చించాం. మనకు స్వాతంత్ర్యం లభించింది అనే భావనలో ఇప్పుడు మనం ఉన్నాం. ఇక చేయాల్సింది ఏమీ లేదు అనే భావన ఆవరిస్తున్నట్టు కనిపిస్తోంది. ప్రజాస్వామ్యం అనే పచ్చని చెట్టు ఎక్కడబడితే అక్కడ ఎదగదు. ఇంగ్లండ్‌లో, అమెరికాలో అది పరిఢవిల్లింది. ఫ్రాన్స్‌లో ఒకమేరకు అభివృద్ధి చెందింది. ఎన్నో దేశాలలో ప్రజాస్వామ్యాన్ని బహిరంగంగా ఖూనీ చేసి సైనిక, నియంతృత్వ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఎన్నో సవాళ్లను అధిగమిస్తే తప్ప ప్రజాస్వామ్యం భారతదేశంలో విజయవంతం కాదు. ఇన్నాళ్లూ మనదేశంలో ఏదైనా తప్పు జరిగితే బ్రిటీషువాళ్ల మీద నెట్టేవాళ్లం. ఇప్పుడు ఆ అవకాశం లేదు. అన్నిటికీ మనమే బాధ్యత వహించాలి.

(అంబేద్కర్ రచనల నుంచి స్వీకారం)

ఏప్రిల్ 14, 2016– బాబాసాహెబ్ 125వ జన్మదినోత్సవం ■

# నేనెందుకు బౌద్ధం వైపు ఆకర్షితుణ్ణయ్యాను?

**- డా॥ బీఆర్ అంబేద్కర్**

**బాబాసాహెబ్ అంబేద్కర్ అనేక పుస్తకాల్ని, వ్యాసాల్ని, కరపత్రాల్ని రాశారు. తాను నడిపిన పత్రికలకు ఎడిటింగ్ బాధ్యతల్ని నిర్వహించారు. అనేక విషయాల మీద పలువురు రచయితలు, మేధావులు బాబాసాహెబ్ వద్దకు సలహాల కోసం వస్తుండే వారు. డా॥ అంబేద్కర్ ముందుమాట రాస్తే తమ పుస్తకం విలువ పెరుగుతుందని చాలామంది రచయితలు భావించే వారు. పుస్తకాలు చదవటంలో మార్క్స్, లెనిన్, గోర్కీ, టి.ఇ లారెన్స్, సి.పి రామస్వామి అయ్యర్ వంటి దిట్టలకు దీటైన అంబేద్కర్ దాదాపు 50,000 పుస్తకాలు చదివినట్టు అంచనా. అంబేద్కర్‌కున్న లైబ్రరీ ఆసియాలోనే అతిపెద్ద లైబ్రరీగా చెప్పేవారు. బాబాసాహెబ్ కలం నుంచి జాలువారిన ప్రతి అక్షరం వెనక ఎంతో అర్థం, ఆలోచన, దూరదృష్టి, తపన ఉంటాయి. అంబేద్కర్ రాసిన గొప్ప పుస్తకం 'బుద్ధుడు – ఆయన దమ్మం (ధర్మం)'. తన మరణానికి తొమ్మిది నెలల ముందు ఆ పుస్తకానికి అంబేద్కర్ పీఠిక రాశారు. అప్పటికే ఆయన తీవ్ర అస్వస్థులుగా అన్నారు. లియోటాల్‌స్టాయ్ తన 'యుద్ధము–శాంతి' నవలను ప్రచురణకు ముందు 23 సార్లు సవరించారట. అంబేద్కర్ కూడా తన జీవితపు చివరి రోజు వరకూ 'బుద్ధుడు–ఆయన దమ్మం' రాతప్రతులను సరిచేస్తూనే ఉన్నారు. 1956, డిసెంబర్ 5వ తేదీ రాత్రి పడుకోబోయేంత వరకూ పుస్తకానికి మెరుగులు దిద్దేపనిలోనే ఉన్నారు. ఆ తర్వాత నిద్రలోనే అంబేద్కర్ మహాపరినిర్వాణం చెందారు. 'బుద్ధుడు–ఆయన దమ్మం' పుస్తకానికి అంబేద్కర్ రాసిన పీఠికను డా॥ భగవాన్ దాస్ 1980లో తాను ప్రచురించిన అంబేద్కర్ అరుదైన పీఠికల సంకలనంలో చేర్చారు. మార్చి, 1956లో రాసిన ఆ పీఠిక 1957లో అంబేద్కర్ మరణానంతరం పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రచురించిన 'బుద్ధుడు–ఆయన దమ్మం' ముందు చేర్చలేదు. బౌద్ధం వైపు తన మనసు ఎందుకు మళ్లిందీ అంబేద్కర్ మనసు విప్పి ఈ పీఠికలో వివరిస్తారు. నిజంగా ఇది అరుదైన, హృదయ పేటికల్ని కదిలించే పీఠిక...**



భారతదేశంలో "అంటరాని వారు"గా పిలువబడే కులంలో నేను పుట్టాను. 'అలాంటి కులంలో పుట్టి ఇన్ని డిగ్రీలు ఎలా సంపాదించారు?' అని చాలామంది తరచుగా నన్ను అడుగుతుంటారు. వాళ్లు తరచూ అడిగే ఇంకో ప్రశ్న –"బౌద్ధుడివి ఎందుకయ్యావు?". ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటానికి ఈ పీఠికయే సరైన స్థలమని భావిస్తున్నాను. నన్ను బౌద్ధం వైపు తిప్పిన కొన్ని ఘటనలి, విషయాల్ని ఇక్కడ చెబుతాను.

మా నాన్న మతవిశ్వాసం మెండుగా కలిగిన వ్యక్తి. నన్నెంతో కఠిన మత క్రమశిక్షణలో పెంచారు. కానీ నాన్న మత విశ్వాస జీవనశైలిలో అనేక వైరుధ్యాలున్నాయని నాకు చిన్నప్పటి నుంచే అనిపించేది. నాన్న సంత్ కబీర్ బాటలో నడిచే వ్యక్తి. విగ్రహారాధన చేసేవారు కాదు. ప్రతిరోజూ పడుకోబోయే ముందు రామాయణ, మహాభారతాలలో ఎంతోకొంత పారాయణం చేస్తేగానీ నన్ను, మా అన్నయ్యను నిద్రపోనిచ్చే వారు కాదు. ఈ విధంగా చాలా ఏళ్లు గడిచాయి. నేను ఫోర్త్ స్టాండర్డ్ పాసయ్యాను. ఈ సందర్భంగా సంబరం జరపాలని మా కులం వాళ్లందరూ నిర్ణయించుకున్నారు. నాన్న దగ్గరికి వచ్చి అడిగారు. "ఇప్పుడేం సాధించాడని? పరీక్ష పాసయ్యాడు, అంతేకదా!" అని నాన్న వాళ్ల కోరికను తోసిపుచ్చారు. కానీ వాళ్లు మాత్రం పట్టువిడవలేదు. దాదా కేలుస్కర్ దగ్గరకు వెళ్లి నాన్నను ఎలాగైనా ఒప్పించవలసిందిగా కోరారు. నాన్నకు దాదా చాలా సన్నిహితమిత్రుడు. కాసేపు సణిగాక నాకు అభినందన సభ ఏర్పాటు చేసేందుకు నాన్న అంగీకరించారు. ఆ కార్యక్రమానికి దాదా అధ్యక్షత వహించారు. ఆయన సాహితీ

**బౌద్ధం చురుకుగా పురోగమించలేకపోవటానికి కారణం బౌద్ధ సాహిత్యం ఎవరూ చదవలేనంత విస్తృతంగా ఉండటం. క్రైస్తవుల బైబిల్‌లాగా ఒక సంగ్రహ, సమగ్ర గ్రంథం బౌద్ధులకు లేదు.**

పరిజ్ఞానం ఉన్న వ్యక్తి. తన ప్రసంగం పూర్తయ్యాక దాదా నాకు ఒక కానుక ఇచ్చారు. అదేంటో తెలుసా?.. బుద్ధుడి జీవితచరిత్ర పుస్తకం! బరోడా సంస్థాన గైక్వాడ్ కోసం ఆయన రాసిన పుస్తకం అది. ఆ పుస్తకాన్ని నేను ఎంతో ఆసక్తితో చదివాను. ఎంతగానో కదిలిపోయాను.

ఇంతకాలం నాన్న నాకు బౌద్ధ సాహిత్యం గురించి ఎందుకు చెప్పలేదు అని మనసులో అనిపించేది. ఒకరోజు ఇదే ప్రశ్న నాన్నను అడిగాను. బ్రాహ్మణుల్ని, క్షత్రియుల్ని కీర్తిస్తూ శూద్రులను, అంటరానివారిని అణగదొక్కే రామాయణ, మహాభారతాలను ఎందుకు చదవమంటున్నారు అని ప్రశ్నించాను. నాన్నకు ఇది నచ్చలేదు. "నిండా 12 ఏళ్లు లేవు. నీకు ఇలాంటి ప్రశ్నలెందుకు? చెప్పింది మాత్రమే ,చేయాల్సిన వయసు నీది" అని దాటవేశారు.

'రోమన్ పితృస్వామిక వ్యవస్థ'కు ప్రతిరూపం నాన్న. ఆయన మాటను ఎవరూ జవదాటకూడదు. చిన్నప్పుడే తల్లిని కోల్పోయిన బిడ్డగా నేను నాన్న ముందు కొంచెం చనువుగా, ధైర్యంగా వ్యవహరిస్తూ ఉండేవాడిని. కొంతకాలం గడిచాక ఒకరోజు అంతకుముందు అడిగిన ప్రశ్ననే మళ్లీ అడిగాను. ఈసారి నాన్న దాటవేయకుండా సమాధానం చెప్పారు. "మనం అంటరానికులానికి చెందినవాళ్లం. మనలో ఆత్మన్యూనతా భావం ఉండటం సహజం. మహాభారతం, రామాయణాలను చదివితే ఆ ఆత్మన్యూనతా భావం పోతుంది. ద్రోణుడ్ని చూడు, కర్ణుడ్ని చూడు, ఎంత కిందిస్థాయి నుంచి ఎంత ఎత్తుకు ఎదిగారో! వాల్మీకిని చూడు. కోలీ తెగకు చెందిన వాల్మీకి రామాయణ కావ్యాన్ని రచించాడు. ఇలాంటి వాళ్ల గురించి చదివితే మనలో ఆత్మన్యూనతాభావం పోతుంది. అందుకే నిన్ను రామాయణ, మహాభారతాలు చదవమంటోంది" అన్నారు.

నాన్న మాటల్లో నాకు కొంత అర్థం కనిపించింది. కానీ సంతృప్తి కలగలేదు. మహాభారతంలోని వ్యక్తులంటే నాకిష్టంలేదని నాన్నతో చెప్పాను. "భీష్ముడు, ద్రోణుడు, కృష్ణుడు అంటే నాకు అస్సలు ఇష్టం లేదు. భీష్మ, ద్రోణులిద్దరూ కపట స్వభావులు. ఒకటి చెప్పి ఇంకోటి చేస్తారు. కృష్ణుడు పెద్ద మోసకారి. అతని జీవితమంతా మోసాలతోనే నిండి ఉంటుంది. అలాగే నాకు రాముడన్నా ఇష్టముండదు. శూర్పణఖ విషయంలో, వాలి-సుగ్రీవుల విషయంలో అతని ప్రవర్తన నాకు నచ్చలేదు. ఇక సీత విషయంలోనైతే అతను మృగంలా ప్రవర్తించాడు" అన్నాను.

నాన్న ఏం మాట్లాడలేదు. విప్లవం వచ్చిందని ఆయనకు అర్థమైంది.

ఇలా నేను బౌద్ధం వైపు తిరిగాను. చిన్నతనంలో తెలిసీతెలియక నేను బౌద్ధం వైపు ఆకర్షితుడినయ్యాననుకుంటే పొరపాటు. నా ప్రశ్నల వెనక, నా ఎంపిక వెనక ఎంతో భావం, వేదన, తర్కం ఉన్నాయి. బుద్ధుడు, ఆయన దమ్మం (ధర్మం) పట్ల నేను ఆసక్తుడినయినా బౌద్ధ సాహిత్యాన్ని 1951 వరకూ రాయలేదు. ఆ సంవత్సరం కలకత్తాకు చెందిన మహాబోధి సొసైటీవారి జర్నల్ కోసం ఒక వ్యాసం రాశాను. ఎంతో శాస్త్రీయ చైతన్యం కలిగిన సమాజానికి అనువైన, అనివార్యమైన మతం బౌద్ధం అని ఆ వ్యాసంలో నేను పేర్కొన్నాను. ఈ ఆధునిక సమాజాన్ని రక్షించగల శక్తి బౌద్ధానికి మాత్రమే ఉందని నేను స్పష్టం చేశాను.

బౌద్ధం చురుకుగా పురోగమించలేకపోవటానికి కారణం బౌద్ధ సాహిత్యం ఎవరూ చదవలేనంత విస్తృతంగా ఉండటం. క్రైస్తవుల బైబిల్‌లాగా ఒక సంగ్రహ, సమగ్ర గ్రంథం బౌద్ధులకు లేదు. నేను జర్నల్‌లో రాసిన వ్యాసం చదివిన తర్వాత అనేకమంది బౌద్ధం కోసం ఒక ప్రామాణిక గ్రంథం రాయాలని కోరారు. వారిచ్చిన స్ఫూర్తితోనే 'బుద్ధుడు-ఆయన దమ్మం' అనే రచనా బృహత్కార్యాన్ని చేపట్టాను. దీని విశిష్టతను పాఠకులే నిర్ణయించాలి. ఈ గ్రంథం నా మేధస్సు నుంచి ప్రభవించిందని నేను చెప్పుకోను. నేను కేవలం సంకలనకర్తను. ఈ రచనలో పాఠకులు సరళతను, స్పష్టతను చూడగలిగితే నేను సఫలీకృతుడినైనట్టే భావిస్తాను.

'బుద్ధుడు-ఆయన దమ్మం' పుస్తకం కంపోజింగ్ జరుగుతున్నప్పుడు చాలా అస్వస్థుడిగా ఉన్నాను. ఇప్పుడు కూడా అస్వస్థతతోనే ఉన్నాను. ఈ ఐదేళ్లలో అనేక ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ఒక దశలో అయితే నేను ఆరిపోతున్న దీపాన్ని అని డాక్టర్లు భావించారు. నా భార్య సబిత, డాక్టర్ మాల్వంకర్‌ల నిర్విరామ ప్రయత్నం వల్ల ఆరిపోతున్న దీపం నిలబడింది. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అలాగే పుస్తక రాతప్రతి టైప్‌వర్క్‌లో విశేష శ్రమ తీసుకున్న ప్రకాష్, రట్టులకు నా ధన్యవాదాలు. బౌద్ధాన్ని ఒక సమగ్రతతో అర్థం చేసుకోవటానికి 'బుద్ధుడు-ఆయన దమ్మం', 'బుద్ధుడు మరియు కార్ల్ మార్క్స్', 'ప్రాచీన భారతదేశంలో విప్లవం మరియు ప్రతిఘాత విప్లవం' అనే పుస్తక త్రయం ఉపయోగపడతాయని నేను భావిస్తున్నాను. ■

**మన స్వయంపాలనకు నూటికి 25 మార్కులు,**
**పౌరుల భాగస్వామ్యానికి 5 లేదా 10 మార్కులు,**
**స్వయం పరివర్తనకు 10 మార్కులు,**
**స్వేచ్ఛకి మాత్రమే 60 మార్కులు,**

# మానసాలు మారని వ్యవస్థలో ప్రజాస్వామ్యం నేతిబీర

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**


నిజమైన ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకొకసారి ఎన్నికలు జరగటమే కాదు. అడపాదడపా ఐదేళ్లకొకసారి, నేతల పుణ్యమా అని అంతకంటే తరచుగా వచ్చే ఎన్నికల్లో అక్రమాలెన్నెన్నో... స్థానిక యంత్రాంగం దయతలచి పేర్లు ఓటర్ల లిస్టులో నమోదు చేసినట్టయితే, అసలు ఓటర్లకు బదులు ఇంకెవరో ఓటు వేయకుండా ఉన్నట్టయితే, స్థానికంగా ఉన్న 'పెద్దలు' దయతలచి ఓటు స్వేచ్ఛగా వేసుకోనిస్తే "ఏ రాయైతేనేమి పళ్లూడ గొట్టుకోవడానికి" అనుకుని ఉన్న అభ్యర్థులలో ఒకరికి అన్యమనస్కంగా ఓట్లు వేస్తున్నారు. ఆ తరువాత ఐదేళ్ల దాకా ప్రభుత్వాలని, రాజకీయ పార్టీలని, ఎన్నికల ప్రహసనాన్ని తిట్టుకుంటూ పరిపాలన పట్ల జుగుప్సతో ఏమీ చేయలేక నిట్టూరుస్తూ కూర్చోవటమే "ప్రజాస్వామ్య"మయితే, భారతదేశంలో "అలాంటి ప్రజాస్వామ్యం" పుష్కలంగా వర్ధిల్లుతోంది. వాస్తవానికి ప్రజాస్వామ్య మంటే ప్రజలు ప్రభువులుగా ఉండాలని, ప్రభుత్వాలలోని పెద్దలు ప్రజల సేవకులని, పాలన ప్రజల కోసమని భావిస్తే భారత ప్రజాస్వామ్యం నేతిబీరకాయలో నెయ్యి చందమని తేలిపోతుంది. స్థూలంగా ప్రజాస్వామ్య వ్యవస్థలాగే కనిపిస్తున్న భారత పాలనా వ్యవస్థలో నిజమైన ప్రజాస్వామ్య లక్షణాలు ఎంతవరకు ఉన్నాయి? వ్యక్తి స్వేచ్ఛ, స్వపరిపాలన, పౌరులకు పాలనలో నిరంతరం భాగస్వామ్యాధికారం, చట్టబద్ధ పాలన, రాజ్యవ్యవస్థలో స్వయంపరివర్తనా శక్తి అన్నవి నిజమైన ప్రజాస్వామ్యంలో అయిదు అంతర్భాగాలు. ఈ అయిదింటి దృష్ట్యా భారత ప్రజాస్వామ్యానికి విలువ కట్టినట్టయితే పరిస్థితి విశదమవుతుంది. అంతకు మించి, లోపాలు ఏ దిశలో ఉన్నాయో తెలిస్తే, పరిష్కారాలు అన్వేషించటం సాధ్యమవుతుంది. స్థూలంగా అవగాహన కోసం దీనిలోని ప్రతి కొలమానంలో సున్న నుంచి నూరు మార్కులు ఉన్నాయని ఊహించి, భారత ప్రజాస్వామ్యానికి ఆయా అంశాలలో ఎన్ని మార్కులు వస్తాయో అంచనా వేద్దాం.



**అధికార మార్పిడి**

వ్యక్తి స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణం. స్వేచ్ఛ అంటే ప్రతి పౌరుడికి తనకిష్టమైన పనిచేసే హక్కు ఉండటం. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తే చాలా సందర్భాలలో ఇతరులకు ఇబ్బంది కలిగి, సమాజం చిన్నాభిన్నం కావచ్చు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రతి వ్యక్తి స్వేచ్ఛకు కొన్ని హేతుబద్ధమైన పరిధులు లేదా అడ్డుగోడలు ఉండాలి. వ్యక్తి స్వేచ్ఛలో ఎన్నో హక్కులు ఇమిడివున్నాయి. భావ ప్రకటన హక్కు, ఎక్కడికైనా వెళ్లే హక్కు, ఎక్కడైనా నివశించే హక్కు, కొందరు కలిసి ఒక సంఘం ఏర్పరుచుకునే హక్కు, మత స్వేచ్ఛ, వృత్తి స్వేచ్ఛ మొదలైన హక్కులన్నీ వ్యక్తి స్వేచ్ఛలో అంతర్భాగమే. భారతదేశంలో స్వేచ్ఛరీత్యా ప్రజాస్వామ్యాన్ని అంచనా వేస్తే పరిస్థితి గర్వకారణంగానే ఉంటుంది. ప్రపంచంలో దాదాపు ఎవరికీ తీసిపోని స్థాయిలో స్వేచ్ఛ ఉంది. ఆచరణరీత్యా, స్వేచ్ఛ ననుభవించటంలో కొన్ని అవాంతరాలున్నాయి. దుర్భర దారిద్ర్యం వలన స్వేచ్ఛకు శృంఖలాలున్నాయి. అధికారంలో ఉన్న వాళ్ల ఆగడాలను ఎదుర్కోవటానికి తగిన ఏర్పాటు లేకపోవటం వలన ఎంతోమంది స్వేచ్ఛకు అవరోధం కలుగుతోంది. న్యాయం సకాలంలో అందే పరిస్థితి లేకపోవటం వలన కొన్ని సందర్భాలలో స్వేచ్ఛ ఎండమావిలా అందకుండా పోతోంది. ప్రభుత్వంలో ఏం జరుగుతున్నదో తెలుసుకునే హక్కు లేకపోవడంతో పౌరుల స్వేచ్ఛకి సంకెళ్లు పడుతున్నాయి. ఇలాంటి అవరోధాలున్నప్పటికీ మొత్తం మీద నిష్పాక్షికంగా పరిశీలిస్తే, స్వేచ్ఛ విషయంలో భారత ప్రజాస్వామ్యానికి మంచి మార్కులే వస్తాయి. స్వేచ్ఛకి కనీసం నూటికి 60 మార్కులు వస్తాయి. కొన్ని స్వేచ్ఛల విషయంలో నూటికి 80 నుండి 90 మార్కులు వేసుకోవచ్చు. స్వపరిపాలన అంటే పౌరులకు తమను తాము ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ పరిపాలించుకునే హక్కు. ఈ అంశంలో పరిస్థితి సందిగ్ధంగా ఉంది. ఇదివరలో చర్చించినట్టు

లోపభూయిష్టమైన ఎన్నికల తతంగమే స్వపరిపాలన అయితే మంచి మార్కులు వేసుకోవచ్చు. కానీ వాస్తవానికి దీనిలో ఎన్నో లోపాలు ఉన్నాయి. 1947లో జరిగింది చాలావరకు వలస ప్రభువుల నుంచి భారత ప్రభువులకు అధికార మార్పిడి మాత్రమే. దొరలు పోయారుగానీ నిజానికి దొరతనం పోలేదు. ఆనాటి పరిస్థితుల్లో ఎలాగోలా దేశ ఐక్యతని, శాంతిభద్రతలని కాపాడాలన్న ఆతృతతో నేతలు కేంద్రీకృతం అయిన పాలనా వ్యవస్థని, అధికారవర్గాల స్వామ్యాన్ని పెద్ద మార్పులు లేకుండా కొనసాగించారు. దానితో పాలనలో పౌరుల పాత్ర నామమాత్రం అయిపోయింది. అధికార వ్యవస్థనూ, ఇతర సంస్థలను అలవాటువడిన కారణంగా కొనసాగించారుగానీ, ప్రజాస్వామ్యానికనుగుణంగా స్వపరిపాలన సార్థకమయ్యేలా రూపొందించుకోలేదు. లోపభూయిష్టమైన ఎన్నికల ప్రక్రియ పౌరులకు సరైన నిర్ణయాధికారం లేకుండా దొందూ దొందే అనేరకమైన అభ్యర్థుల పోటీలు, నిరంకుశంగా, సొంత ఆస్తుల మాదిరిగా నడుస్తున్న రాజకీయ పార్టీలు, ఒకసారి ఎన్నికయ్యాక ప్రజలకు జవాబుదారీగా లేకుండా యధేచ్ఛగా వ్యవహరించే అవకాశం ఉన్న ప్రభుత్వాలు, నేతలూ, మంచివాళ్లను, సమర్థులను దూరం చేసి డబ్బుకి, కండబలానికి పెద్దపీట వేసే రాజకీయ ప్రక్రియ, అధికార లాలస, ప్రజాసంక్షేమం నామమాత్రమైన పాలనా వ్యవస్థ– ఇవన్నీ స్వపరిపాలనను కళంకితం చేశాయి. ఎన్నిసార్లు ఎన్నికలు జరిగినా, ప్రభుత్వాలు మారినా, కొందరు ఓడి మరికొందరు గెలిచినా, చివరకు పౌరులు నిరంతరం దుర్భరమైన ఓటమినే చవిచూస్తున్నారు. దాంతో ఎన్నికలున్నా స్వపరిపాలన మిధ్యగా మారిపోయింది. స్వపరిపాలనకు నూటికి 25 మార్కులకంటే రావటం కష్టం. ఇది నిజమైన ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. పౌరుల భాగస్వామ్యాధికారం అంటే నిరంతరం పాలనలో పౌరులకు పాత్ర ఉండి, పాలనా నిర్ణయాలను పౌరులే ప్రత్యక్షంగా వీలైన చోట్ల తీసుకోగలగటం, లేదా పరోక్షంగా ప్రభావితం చేయగలగటం. కేంద్రీకృతమైన అధికారస్వామ్యంలో పౌరుల పాత్ర పాలితులుగా మాత్రమే. పాలనలో భాగస్వామ్యం, అధికారం పౌరులకు శూన్యం. చివరకు స్థానిక విషయాలు కూడా పౌరుల పాత్ర లేకుండా నిర్ణయమవుతున్నాయి. అనుభవం, అవసరం ఎక్కడున్నాయో, నిర్ణయాధికారం అక్కడ లేకపోవటంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. ప్రజావసరాలు తీరటంలో తీవ్ర వైఫల్యం ఎదురవుతోంది. స్థానిక పాఠశాల, ఆసుపత్రి, రేషన్‌షాపు, నీరు, మురుగుకాల్వలు వీటన్నిటిలో పౌరుల పాత్ర చేయి చాచి అర్థించటమే తప్ప, ప్రజాస్వామ్యంలో ప్రభువులుగా, పన్ను చెల్లించే పౌరులుగా, డబ్బిచ్చే వినియోగదారులుగా పౌరులకేమీ పాత్ర లేదు. ఉదాహరణకి విద్యుత్తు, టెలిఫోను వంటి సౌకర్యాల విషయంలో కూడా పౌరుడి పాత్ర డబ్బిచ్చి చేయిచాచి అర్థించటానికే పరిమితం. పౌరుడు వినియోగదారుడని, పన్నులు చెల్లించేవాడని, అతడి కోసం మొత్తం పాలనాయంత్రాంగం ఉన్నదని వ్యవస్థలో గుర్తింపే లేదు. అధికార యజ్ఞంలో పౌరులు సమిధలే తప్ప పాత్రధారులు కారు. నాయకులు, ప్రభుత్వోద్యోగులు ప్రజలకు సేవకులుగా కాక ప్రభువులుగా మారారు. పౌరుల్ని బానిసలుగా మార్చారు. పాలనా పద్ధతులు ప్రజలకేమీ అర్థం కాకుండా, వారి పాత్ర లేకుండా, పాలకుల సౌకర్యం కోసం మాత్రమే ఏర్పాటయ్యాయి. పౌరుల భాగస్వామ్యాధికారం విషయంలో భారత ప్రజాస్వామ్యానికి వచ్చే మార్కులు నూటికి 5 లేదా 10కి మించవు. ఇది నిజమైన ప్రజాస్వామ్యంలో అనూహ్యమైన, లజ్జతో కుంగిపోవలసిన పరిణామం. చట్టబద్ధ పాలనలో ఎంతటి సంపన్నులైనా, ఉన్నతాధికారులైనా చట్టం ముందు సామాన్యుడితో సమానం కావాలి. ఇది ప్రజాస్వామ్యానికి మూలాధారం. నిరంకుశ ప్రభువుల చిత్తం వచ్చినట్టు పాలన జరగకుండా, పుట్టుకతో, హోదాతో, సంపదతో నిమిత్తం లేకుండా అందరికీ సమాన హక్కులు, పాలనలో అందరినీ సమానంగా చూడటం– ఇవి చట్టాల పాలనకు ఆధారం. భారతదేశంలో అన్ని పాలనా వ్యవస్థలు చట్టమే శిరోధార్యమని నిరంతరం ఉద్ఘోషిస్తాయి. వాస్తవానికి అనుభవంలో చట్టం సామాన్యులకోరకంగా, అంతస్తు, హోదా, అధికారం ఉన్నవారికి మరోరకంగా వర్తిస్తోంది. ప్రభుత్వం నుండి వచ్చే లైసెన్సులూ, సదుపాయాల విషయంలోగానీ, పౌరులకు హక్కుగా ఉన్న ఏ చిన్న పని అయినా జరగటంగానీ పరిశీలిస్తే, సిఫార్సుగానీ, లంచంగానీ లేకుండా సామాన్యుడికి న్యాయం జరగటం దుస్సాధ్యం. పాలనలో రహస్యం, ఎన్నికల కోసం నిధుల సమీకరణలో సర్వదా కనిపించే అక్రమాలు, వాటి ఫలితంగా ఆశ్రితులకి, అయినవాళ్లకి కల్పించే ప్రత్యేక సదుపాయాలు, పైరవీలతో తప్ప తెరుచుకోని ఫైళ్లు, లంచాలే లేకపోతే మూతపడే తలుపులు, కోర్టుల్లో సంవత్సరాల తరబడి జాప్యాలు, నిర్దేశించిన పద్ధతి ప్రకారం ఏమీ జరగని పనులు, బెదిరింపులకు తప్ప ప్రతిస్పందించని పాలనాయంత్రాంగం– వీటన్నింటి పుణ్యమా అని అధికారం, కండబలం, డబ్బు, హోదా ఉన్న వాళ్ల చేతుల్లో చట్టం కీలుబొమ్మగా మారిపోయింది. సామాన్య పౌరులు హుందాతనాన్ని కోల్పోయి, ప్రతి పనికి సర్దుకుపోవటం నేర్చుకుని, అవమానభారాన్ని



దిగమింగుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 'చట్టపాలన' దృష్ట్యా భారత ప్రజాస్వామ్యానికి నూటికి 5 మార్కులు కూడా కష్టమే. గతానుభవం నుండి నిరంతర పాఠాలు నేర్చుకుని, తదనుగుణంగా నిర్దిష్ట లక్ష్యంతో మార్పులు చేసుకుంటూ, పాలనా యంత్రాంగాన్ని ప్రజలకు సమర్థంగా సేవలందించే పరికరంగా తయారుచేసే ప్రక్రియ రాజ్యవ్యవస్థలో స్వయం పరివర్తనా శక్తి. కొద్దిమంది చిత్తశుద్ధిగల నాయకులో, అధికారులో విశ్వప్రయత్నం చేసి అక్కడక్కడ కొన్ని మంచి మార్పులు తేవడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ పాలనా వ్యవస్థ మొత్తాన్నీ చూస్తే ప్రజల అవసరాలతో పోలిస్తే, కొద్దిమార్పులు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. ఎలాంటి రాజ్యవ్యవస్థ అయినా అన్ని విధాలా సంతృప్తికరంగా ఉండజాలదు. నిరంతర శోధన, దైనందిన స్పందన, నిర్విరామ పరివర్తన లేనట్టయితే పాలన స్తంభించిపోతుంది. చెడు పెరుగుతుంది. మంచి ఇంకిపోతుంది. భారత పాలనా వ్యవస్థలన్నీ ఈ స్వయంపరివర్తనా శక్తిని కోల్పోవటంతో శుష్కించి పోతున్నాయి. పన్నులు వసూలు చేసి, జీతభత్యాలు పుచ్చుకుని, తమని తాము పోషించుకోవడం తప్ప, ఎదురవుతున్న సమస్యల్ని సమర్థంగా పరిష్కరించే నేర్పరితనాన్ని పాలనా వ్యవస్థ కోల్పోయింది. పట్టు తప్పి దీనావస్థలో ఉంది. దశాబ్దాల పర్యంతం ఎన్నో విషయాలపై చర్చ జరిగినా ఫలితం శూన్యం. ఎన్నికల సంస్కరణలు, పార్టీల ప్రజాస్వామీకరణ, నిజాయతీగా నిధుల సమీకరణ, కేంద్ర రాష్ట్ర సంబంధాల సమతూకం, రాజ్యాంగంలో 356వ అధికరణం దుర్వినియోగం, న్యాయమూర్తుల, ఇతర రాజ్యాంగ సంస్థల నిష్పాక్షిక నియామకం, లంచగొండితనం నిర్మూలన, పాలనా సంస్కరణలు, పోలీసు వ్యవస్థ ప్రక్షాళన, నిజమైన స్వయంపాలనాధికారం ఉన్న స్థానిక ప్రభుత్వాలు, న్యాయస్థానాల్లో సత్వర కేసుల పరిష్కారం ఇలా ఎన్నో అంశాలు– అన్ని వర్గాల ప్రజలు, అన్ని రాజకీయ పక్షాలు పరిష్కారం కోసం ముక్తకంఠంతో పరితపించిన అంశాలు– కొంతమేరకు ఏకాభిప్రాయాన్ని సాధించిన అంశాలు– ఇవన్నీ నేటికీ అపరిష్కృతంగా, ఏ మార్పు లేకుండా 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా పడున్నాయి. స్థానికంగా చిన్న విషయాల్లో కూడా మార్పులు కావాలంటే బంద్‌లు, హర్తాళ్లు, సమ్మెలు, లాఠీ దెబ్బలు, దహనకాండ, హింస, నిరసన వ్రతాలు తప్పటం లేదు. పాలనా వ్యవస్థ స్వయం పరివర్తనా శక్తిని చాలావరకు కోల్పోయిందని భావించటానికి ఈ ఆధారాలు చాలు. ఈ కొలమానంలో స్వయం పరివర్తనకు మార్కులు నూటికి 10ని మించవు.

## నిర్మాణ లోపమే కారణం

సంక్షోభానికి కారణం వ్యక్తులు మాత్రమే కాదని, ఇది వ్యవస్థాగత సంక్షోభమని విశ్లేషణలో విదితమవుతోంది. వ్యవస్థలో తీవ్ర లోపాలుండటం వల్ల, నిర్మాణమే బలహీనంగా ఉండటం వల్ల, కాలక్రమేణా ప్రజాస్వామ్య సౌధం బీటలు వారింది. భారత రాజ్యాంగ నిర్మాతలు నిస్సందేహంగా దేశభక్తులు, ప్రతిభావంతులు, ప్రజాస్వామ్య దృక్పథం, మానవ విలువలు, జీవితానుభవం, లోతైన ఆలోచన, స్పష్టమైన అవగాహన, చిత్తశుద్ధి పుష్కలంగా ఉన్నవాళ్లు. ఈ శతాబ్దంలో స్వాతంత్ర్యం పొందిన మరే దేశంలోనూ ప్రారంభస్థాయిలో అంతటి విశిష్ట లక్షణాలు మూర్తీభవించిన నాయకత్వం కానరాదు. కానీ, దేశ విభజన నేపథ్యంలో జాతి ఐక్యతను కాపాడవలసిన గురుతర బాధ్యత వారి మీద ఉండటంతో, జరిగిన దారుణ మారణ హోమం దృష్ట్యా శాంతి భద్రతలు పునరుద్ధరించి సంరక్షించవలసిన ఆవశ్యకత వల్ల, పెద్దగా మౌలికమైన మార్పులు లేకుండా బ్రిటీషు వారి పాలనా వ్యవస్థ మీద ప్రజాస్వామ్యం మేలిముసుగు కప్పి, వయోజన ఓటు హక్కు ప్రాథమిక హక్కులతో తృప్తిపడి, పాలనలో యధాతథ పూర్వస్థితిని కొనసాగించవలసి వచ్చింది. దేశ విభజన సందర్భంలో జరిగిన కలహాల వల్ల ఇరుపక్కల దాదాపు కోటిమంది శాశ్వతంగా వలసపోవలసి వచ్చింది. 10లక్షలమందికిపైగా ఆ నరమేధంలో ప్రాణాలు కోల్పోయారు. 6 లక్షలమంది క్షతగాత్రులయ్యారు. 3లక్షలమంది అమాయక స్త్రీలు లైంగిక అత్యాచారాల పాలయ్యారు. శాంతి సమయంలో అంతటి ఘోరకలి మానవేతిహాసంలో మరొకటి జరగలేదు. దాంతో నూతన రాజ్యాంగాన్ని రచిస్తున్నప్పుడు దేశ విభజన చేదు జ్ఞాపకాలు నేతలనావరించాయి. పరిస్థితుల ప్రాబల్యం వలన, నూటికి 80 పాళ్లు మార్పులు లేకుండా 1935 నాటి భారత ప్రభుత్వ చట్టాన్ని, బ్రిటీషు కాలం నాటి పాలనా వ్యవస్థని 1950 నాటి భారత రాజ్యాంగంలో పొందు పరచవలసి వచ్చింది. ఆనాటి చారిత్రక నేపథ్యంతోపాటు, స్వతంత్రానుభూతి వల్ల కలిగిన పారవశ్యంలో తెల్లదొరల స్థానే భారత నేతలకు అధికారం సంక్రమించటంతోనే సమస్యలు తీరుతాయని, ప్రజాస్వామ్యం అప్రయత్నంగా పరిఢవిల్లుతుందని ప్రజలు సంబరపడ్డారు. తదుపరి అనుభవం ఈ ఆశాసౌధాలను కూల్చివేసింది. స్వతంత్రం వచ్చిన కొత్తలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి వల్ల, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న నేతల వ్యక్తిగత ప్రతిష్ట, నాయకత్వ పటిమల వల్ల, త్వరలో స్వాతంత్ర్య ఫలాలు అనుభవంలోకి వస్తాయన్న ఆశ వల్ల వ్యవస్థలోని లొసుగులు బహిర్గతం కాలేదు. దాంతో మొదట ఒకటి, రెండు దశాబ్దాల కాలం జాతిలో ఆత్మవిశ్వాసం, భవిష్యత్తు పట్ల ఆశ తొణికిసలాడాయి. సమాజంలో శాంతి, సుస్థిరత, సహజీవనం సాధ్యమయ్యాయి. తొలికాలపు ఆశలు నీరసించటంతో, ఎన్నికలు జరిగి ప్రభుత్వాలు మారినా ఆశలకు అనుభవానికి మధ్య అగాధం పూడకపోవటంతో, జన సామాన్యం కాలక్రమేణా అశాంతికి, అపనమ్మకానికి లోనైంది. రాజ్య నిర్మాణంలోని లోపాల్ని పరిశీలించి సంస్కరించందే ఈ సంక్షోభం సమసిపోదు, ప్రజాస్వామ్యం పరిఢవిల్లదు.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా జులై 14, 1997న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం) ■

# ఇక లోక్‌సత్తా 2.0, ఎన్నికలలో పోటీకి దూరం, పార్టీలకతీతం

## రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, విద్య-ఆరోగ్యం కోసం పోరాటం: జేపీ

ఉద్యమంగా, పార్టీగా ఇరవయ్యేళ్ల లోక్‌సత్తా భావాలు అజరామరమే అయినా రాజకీయాలలో వచ్చిన మార్పులకు, ప్రజల ఆలోచనాతీరుకు అనుగుణంగా కొత్త తీరుతో, నవరించిన ఎజెండాతో పోరాడాలని నిర్ణయించినట్టు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు.




లోక్‌సత్తా 2.0లో భాగంగా ఎన్నికలకు దూరంగా ఉండాలని, పార్టీలకతీతంగా తెలుగువారికి, ఈ దేశభవిష్యత్తుకి కీలకమైన మూడు అంశాలపై తక్షణ కార్యాచరణను చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఎన్నికల విరామం ప్రకటించినా రాజకీయ పరివర్తన కోసం తమ కృషి కొనసాగుతుందని, అయితే ఇప్పట్లో ఎన్నికలలో పోటీ చేయం కాబట్టి లోక్‌సత్తా ఉద్యమానికి, పార్టీకి తేడా ఉండదని, అన్ని వర్గాలతో కలిసి వేగంగా ఫలితాలను సాధించగలమని విశ్వసిస్తున్నామని చెప్పారు.

**లోక్‌సత్తా ఆవిర్భావం, కృషి, 2.0 నేపథ్యం, కార్యాచరణపై జయప్రకాష్ నారాయణ్ బషీర్‌బాగ్ దేశోద్ధారకభవన్ (ప్రెస్‌క్లబ్)లో మీడియా ద్వారా ప్రజలకు వివరించారు. మార్చి 20న లోక్‌సత్తా పార్టీ ముఖ్యనేతలతో ఈ అంశాన్ని చర్చించారు.**

జేపీ మాట్లాడుతూ, నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించే సమగ్ర రాజకీయ, పాలనా సంస్కరణోద్యమం భారతదేశంలో లోక్‌సత్తాతోనే మొదలైందని, చాలామంది సూక్ష్మస్థాయిలో ఆ కృషిని చేసినా మొట్టమొదటి సమూల కృషి లోక్‌సత్తాదేనని వివరించారు. ప్రజల చుట్టూ తిరిగే వ్యవస్థల నిర్మాణాన్ని లోక్‌సత్తా ఒక ఉద్యమంలా మార్చిందని, ఈ క్రమంలో గత 20 ఏళ్లలో దేశంలో ప్రజాస్వామ్య ఉద్యమాలకు, ఎన్నో మౌలిక మార్పులకు లోక్‌సత్తా నాంది పలికిందని అన్నారు. ప్రజాస్వామ్య పీఠం (1996)తో ప్రారంభమైన ప్రయత్నం లోక్‌సత్తా (1997)గా రూపుదిద్దుకుని తెలుగునాట, దేశవ్యాప్తంగా లక్షలమందిని ప్రభావితం చేసిందన్నారు. ప్రజాస్వామ్యంలో పౌరులు పౌరుల్లాగా ప్రవర్తించాలిగానీ పాలితులుగా కాదని, ఇందుకోసం కొత్త ధోరణులతో.. సాక్ష్యాధారాలు, తర్కం ఆధారంగా పరిష్కారాలను, ద్వేషరహితంగా సామరస్య వాతావరణంలో మంచి బహిరంగ చర్చను సమాజం ముందు పెట్టటంలో లోక్‌సత్తా గొప్ప విజయం సాధించిందన్నారు. పార్టీల పట్ల పక్షపాత ధోరణి చూపకుండా, ఎన్నికైనవాళ్లంతా ద్రోహులు అన్న నిరాశనిరసన భావాల్ని ప్రదర్శించకుండా రాజ్యాంగ పద్ధతుల ద్వారా, సామరస్యంగా పరిష్కారాల కోసం విశేష కృషి చేయబట్టే ఈ దేశ చరిత్రలో మరే ఉద్యమమూ సాధించనన్ని ఫలితాలను లోక్‌సత్తా సాధించిందన్నారు. ఓటర్ల జాబితాల్లో తప్పుల్ని సవరించి ప్రజలు తేలిగ్గా ఓటు నమోదు చేసుకోగలిగేందుకు మెరుగైన ఏర్పాటు నుంచి ఇటీవల ఈదేశానికి రూ. 3లక్షల కోట్లకు పైగా ఆదాయం తెచ్చిన సహజ వనరుల వేలం పద్ధతి వరకూ పలు సంస్కరణల్ని ఏ అధికారంలేకుండా లోక్‌సత్తా సాధించగలిగిందన్నారు. వాటిలో కొన్ని:

(1) పెట్రోలు బంకుల్లో తూనికల మోసాన్ని చాలావరకు అరికట్టటం (2) ఓటర్ల జాబితాల ప్రక్షాళన (3) అభ్యర్థుల నేరచరితని, ఇతర వివరాలని ప్రకటించే చట్టం (2003) (4) పార్టీల విరాళాలలో పారదర్శకతని తెచ్చే చట్టం (2003) (5) పరోక్ష పన్నుల (సెంట్రల్ ఎక్సయిజ్, కస్టమ్స్) సేకరణలో కీలక సవరణలు (6) పార్టీ ఫిరాయింపు నిషేధాన్ని బలోపేతం చేసే రాజ్యాంగ సవరణ (91వ సవరణ) (7) మంత్రివర్గ సభ్యుల సంఖ్యని కుదించే ఏర్పాట్లు (91వ సవరణ) (8) పాలనా సమాచార హక్కు చట్టం (2005) (9) జాతీయ ఆరోగ్య మిషన్ (2005) (10) స్థానిక న్యాయాలయాల చట్టం (2009) (11) సహకార సంఘాల స్వయంప్రతిపత్తి (97వ రాజ్యాంగ సవరణ – 2012) (12) 2 జీ – స్పెక్ట్రం లైసెన్సుల రద్దు – సహజ వనరుల వేలం పాట విధానం (2013) (13) లోక్‌పాల్ చట్టం (2014) (14) ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం జాతీయ జ్యుడీషియల్ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ– 2014).

"ఆటనియమాలను మార్చటం ముఖ్యంగానీ ఆటగాళ్లను మార్చటం చాలదని తొలినుంచి లోక్‌సత్తా వాదిస్తూ వచ్చింది. అయితే పదేళ్ల లోక్‌సత్తా ప్రస్థానం తర్వాత మౌలికమయిన

రాజకీయ సంస్కరణల్ని సాధించటం కోసం ప్రధాన పార్టీల మీద రాజకీయ ఒత్తిడి కూడా అవసరమన్న ఆలోచన కాలక్రమేణా బలపడింది. మారుతున్న సామాజిక, ఆర్థిక వ్యవస్థలు, పెరుగుతున్న పట్టణీకరణలో కనీసం పట్టణ ప్రాంతాలు, మధ్యతరగతివారు, యువతలో ఓ 20శాతంమంది నిలకడగా మన వ్యవస్థలో మార్పు కోసం ఓటు వేయటానికి సిద్ధపడితే దాని ప్రభావం మన రాజకీయ వ్యవస్థ మీద ఖచ్చితంగా ఉంటుందని లోక్‌సత్తా భావించింది. మన ఎన్నికల వ్యవస్థలో 15–20శాతం ఓట్లు వచ్చినంత మాత్రం చేత ఆ పార్టీలకు చట్టసభలో ప్రాతినిధ్యం లభించదు. కానీ ప్రజల్లో మార్పు కోరే వారి సంఖ్య పెరుగుతుందనే ఉద్దేశం ప్రతి పార్టీనీ ప్రభావితం చేస్తుంది, వాటి విధానాల్ని, ఆలోచనని, రీతిని ప్రభావితం చేస్తాయి. ప్రజలు మార్పును కోరుతున్నారన్న సాక్ష్యాలు ఓట్ల రూపంలో బలంగా కనపడ్డప్పుడు మాత్రమే ప్రధాన పార్టీలు స్పందించి మార్పును తీసుకున్నాయని ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామ్యాల అనుభవం చెబుతోంది. అందుకే, మార్పుని కోరే ప్రజల ఓటుని సంఘటితం చేసి మన రాజకీయ, పాలనా సంస్కరణలు వేగవంతం చేయటం కోసం ఓ వర్గంగానూ, ఒక నిజమైన నాగరిక ప్రజాస్వామ్యంలో పార్టీల తీరు, బహిరంగ చర్చ ప్రమాణాలు ఎలా ఉండాలో ఆచరణలో చూపెట్టాల్సిన అవసరముందన్న ఆలోచనతోనూ లోక్‌సత్తా పార్టీ (2006) ఏర్పడింది. అయితే, పార్టీకి ప్రజల మనసుల్లో ఆదరణ ఉన్నా మన ఎన్నికల వ్యవస్థ కారణంగా, మన సమాజంలో రాజకీయంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా లోక్‌సత్తాకు లభిస్తున్న ఓట్లు మనదేశంలో వేగంగా గణనీయ మార్పుల్ని సాధించటానికి కావలసిన వాటికంటే బాగా తక్కువ వచ్చాయి. లోక్‌సత్తాను 1–2శాతం మినహా మిగిలినవారు సెకండ్ ఛాయిస్‌గా భావించటం వల్ల ఆశించిన మార్పు రావటం లేదు" అని జేపీ అన్నారు.

ఈ అనుభవాల నేపథ్యంలో, లోక్‌సత్తా ఒక పార్టీగా బలోపేతమయ్యేంత వరకూ ఈదేశంలో సమూల మార్పు ఆలస్యం కాకూడదన్న భావనతో, సమాజంలో పార్టీ అనే శత్రుత్వభావనతో లోక్‌సత్తా ఎజెండాకు దూరంగా ఉండకూడదన్న భావనతో ఎన్నికలను కొంతకాలం పక్కనపెట్టాలని నిర్ణయించినట్టు జేపీ తెలిపారు. లోక్‌సత్తా మార్కు రాజకీయాలకు పరిస్థితులు అనుకూలించేంత వరకూ ఎన్నికలలో పాల్గనకపోయినా, రాజకీయ, పాలనా సంస్కరణల కోసం లోక్‌సత్తా ఫ్యామిలీ అలుపెరగని కృషిని కొనసాగిస్తుందన్నారు. రాష్ట్రాలకు గతంలో కంటే కేంద్రం నుంచి నిధులు గణనీయంగా పెరిగి ఫెడరలిజం కొంత బలపడినప్పటికీ, సామాన్య ప్రజలఎదుగుదలకు కీలకమైన విద్య, ఆరోగ్యం, ఆదాయ అవకాశాలు, స్థానిక ప్రభుత్వాలు వంటివి కేంద్రం గుప్పెట్లో ఉండటం వల్ల రాష్ట్రాల్లో తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. విద్యాహక్కు చట్టంలో, ఆహారభద్రతా చట్టంలో, స్వచ్ఛ భారత్‌లో, చివరికి సర్పంచ్ ఎన్నికలో ఎలా వ్యవహరించాలో కేంద్రమే పైనుంచి రుద్దుతోందన్నారు. దేశసమగ్రత అంటే ఇలా కేంద్రీకృత పాలనకాదన్నారు. రాజకీయానికి, పాలనకు రాష్ట్రాలు కేంద్రబిందువుగా ఉంటున్న తరుణంలో, కేంద్రం ఈ రంగాలలో రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వకపోవటం వల్ల ఆటగాళ్లు మారుతున్నారు తప్ప ఆటనియమాలు మారటం లేదన్నారు.

**ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇతర రాజకీయ, పాలనా సంస్కరణలతోపాటు కీలకమయిన సంస్కరణలని వెంటనే సాధించటం దేశ భవిష్యత్తుకి అవసరమని, వీటిని సాధించటం లోక్‌సత్తా 2.0 కార్యాచరణగా ఉంటుందని జేపీ ప్రకటించారు...**

1. ఫెడరలిజాన్ని పునర్నిర్వచించి.. కేంద్రం అధికారాలకి, దేశ సమగ్రతకి భంగం లేకుండా రాష్ట్రాల పూర్తి స్వయం నిర్ణయాధికారాలనిచ్చి ప్రజలకి పూర్తిస్థాయిలో సేవలందించే వెసులుబాటునివ్వటం

2. ఉత్తమ ప్రమాణాల విద్యని ప్రతి బిడ్డకీ అందించటం, ప్రతి కుటుంబానికీ జేబులో ఖర్చు లేకుండా ఉత్తమ ప్రమాణాల ఆరోగ్యాన్నందించే వ్యవస్థని ఏర్పరచటం

3. స్థానిక ప్రభుత్వాలకి, పౌరులకి పూర్తి బాధ్యతలు, పన్నుల్లో వాటాని అందించి స్థానికంగా సమస్యల పరిష్కారంలో, విధానాల అమలులో వారిని పూర్తి భాగస్వాములని చేయటం.

భారతదేశ పరివర్తన కోసం లోక్‌సత్తా చేస్తున్న ఈ బృహత్ ప్రయత్నంలో భావసారూప్యత గల అన్ని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, వ్యక్తులు కలిసిరావలసిందిగా జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

లోక్‌సత్తా ఉద్యమంతో 15 ఏళ్లుగా, పార్టీతో తొలినుంచీ తనకు అనుబంధం ఉందని, రాజకీయాధికారం లక్ష్యాల సాధనకు ఒక మార్గమే తప్ప గమ్యం కాదని లోక్‌సత్తా ఎప్పుడూ భావిస్తుందని, ప్రస్తుత పరిస్థితుల్లో, లోక్‌సత్తాకున్న వనరులతో అత్యుత్తమ ఫలితాల సాధనకు ఈ నిర్ణయం తీసుకున్నామని పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ తెలిపారు.

లోక్‌సత్తా 2.0 కార్యాచరణ కోసం కూకట్‌పల్లికి చెందిన వలంటీర్ వి. సత్యనారాయణ రూ.10,000 చెక్కును జేపీకి ఈ సందర్భంగా అందచేశారు.

సమావేశంలో లోక్‌సత్తా ఉద్యమసంస్థ తెలంగాణ కన్వీనర్ ఎన్. శ్రీనివాస్, లోక్‌సత్తా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హైమా ప్రవీణ్ పాల్గొన్నారు. ■

# "ఫోర్బ్స్" ప్రశంసలో లోక్‌సత్తా వాటా ఏది మోదీ గారూ?

మార్చి 9న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటు ఎగువసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సమాధానం చెబుతూ రాజకీయ విమర్శలతోపాటు ప్రజాస్వామిక విలువల గురించి పలు అంశాలను ప్రస్తావించారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి అనేకమంది నాయకులను స్మరించారు. గొప్ప వ్యక్తులకు నెలవైన రాజ్యసభ ప్రభావం లోక్‌సభ, అసెంబ్లీలు, మునిసిపల్ కార్పొరేషన్లపైనా ఉంటుందని, కాబట్టి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా సానుకూల వాతావరణాన్ని రాజ్యసభలో నెలకొల్పాలన్నారు. ఆలోచనల గనిగా నెహ్రూ అభివర్ణించిన రాజ్యసభ దేశ ప్రయోజనాల కోసం పనిచేయాలని, కీలక బిల్లులను పార్టీలకతీతంగా ఆమోదించాలని అన్నారు. ఇలా మాట్లాడుతూ అవినీతిపై కాంగ్రెస్‌ను ఎండగట్టే క్రమంలో తన ప్రభుత్వానికి అతిపెద్ద విజయంగా భావించే ఓ విషయాన్ని మోదీ చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు దేశ వ్యాప్తంగా అవినీతి, ఆశ్రితపక్షపాతం రాజ్యమేలి భారత ప్రతిష్టను మసక బార్చాయని, అటువంటి అంశాలకు స్థానం లేకుండా తాము సహజ వనరులకు వేలం పాట నిర్వహిస్తే బొగ్గు గనుల వేలం ద్వారా రూ.3లక్షల కోట్లు, స్పెక్ట్రం వేలం ద్వారా రూ.లక్ష కోట్లు సమకూరాయని, ఆరు ఇతర ఖనిజాల వేలం పాటల ద్వారా రూ.1800 కోట్లు లభించే అవకాశముందని తెలిపారు. ఈ మార్పు తెచ్చి దేశానికి ఇంత భారీ ఆదాయాన్ని అందించినందుకు "ఫోర్బ్స్" వంటి అంతర్జాతీయ పత్రిక తమను ప్రశంసిఁచిందన్నారు. రూ.15లక్షల కోట్ల విలువైన 300 ప్రాజెక్టులను తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.



ఖచ్చితంగా మోదీ ప్రభుత్వాన్ని ప్రశంసించవలసిందే. కానీ ఈ ప్రశంస మోదీ సర్కారుకు మాత్రమేనా దక్కాల్సింది? విలువైన, పరిమితమైన దేశ సహజ వనరుల్ని ఇష్టమొచ్చినట్టు కాకుండా వేలం పద్ధతి ద్వారా, పారదర్శకంగానే కేటాయించాలని గాలి జనార్ధన రెడ్డి కేసు దగ్గర్నుంచి పోరాడుతున్న లోక్‌సత్తా 2జీ స్పెక్ట్రం అక్రమ లైసెన్సులపై చేసిన న్యాయపోరాటం వల్లే వేలం పద్ధతి మొదలైంది.

2జీ స్పెక్ట్రం లైసెన్సుల కుంభకోణంపై లోక్‌సత్తా పదులవేల పోస్టుకార్డులతో, ప్రధానికి రూ.1 మనియార్డర్లతో క్షేత్రస్థాయిలో ప్రచారయుద్ధం చేశాక డిసెంబర్, 2010లో సుప్రీంకోర్టులో జె.ఎం లింగ్డో, ఎన్.గోపాలస్వామి, టి.ఎన్ కృష్ణమూర్తి, పి.శంకర్, జూలియో రెబీరో, అడ్మిరల్ తహిల్యాని తదితర సుప్రసిద్ధ భారతీయులను భాగస్వాముల్ని చేస్తూ పిటిషన్ (423/2010) దాఖలు చేసింది. ఆ లైసెన్సుల్ని రద్దు చేస్తూ ఫిబ్రవరి 2, 2012న తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు, ఇక నుంచి ప్రకృతి వనరుల కేటాయింపును విధిగా బహిరంగ వేలం పాటల ద్వారానే నిర్వహించాలని ఆదేశించటంతో బొగ్గు, స్పెక్ట్రం వేలం పాటలు జరిగి సి.ఎ.జి లెక్కకు కూడా అందని ఆదాయం సమకూరింది. సుప్రీం తీర్పును అడ్డుకోకుండా సానుకూలంగా స్పందించి మోదీ ప్రభుత్వం అభినంద నీయంగా అమలుచేసింది. ఈ నేపథ్యంలో ప్రధాని "ఫోర్బ్స్" ప్రశంసల వెనక లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆధ్వర్యంలో పౌరసమాజం చేసిన కృషిని కూడా ప్రస్తావించి ఉంటే బాగుండేది.



సరైన వ్యవస్థాగత సంస్కరణల్ని తెస్తే మనదేశం ఎంత మేలిమార్పుని సాధించవచ్చో బొగ్గు, స్పెక్ట్రం బహిరంగ వేలం పాటల్లో వచ్చిన లక్షల కోట్ల ఆదాయం రుజువు చేస్తోంది. అవినీతి అంతానికి, దేశ వనరులు అందరికీ అందేలా చేయటానికి ఇంకా చాలా సంస్కరణలు అవసరమున్నప్పటికీ వనరుల కేటాయింపులో ఆశ్రితపక్షపాతాన్ని, అవినీతిని తొలగించటం, వేలం ద్వారానే కేటాయించటం ఒక మైలురాయి. దూరదృష్టితో, విచక్షణతో మన వ్యవస్థలో మార్పుల కోసం చేసే పోరాటం ఎలాంటి దీర్ఘకాల ఫలితాలనిస్తుందో లోక్‌సత్తా సాధించిన ఈ విజయం రుజువు చేస్తోంది. పెట్రోలు బంకుల్లో అవకతవకల్ని సరిచేయటం దగ్గర్నుంచి లోక్‌సత్తా చేసిన కృషి వల్ల ఈదేశ ప్రజలకు లక్షల కోట్లు ఆదా అయ్యాయి, లభించాయి. తాజా వనరుల వేలం సంస్కరణలో లోక్‌సత్తా కీలక భాగస్వామికావటం సంతోషాన్నిస్తోందని చెబుతూ, ఇందులో భాగమైన సుప్రీంకోర్టు, ప్రభుత్వం, గనులు, టెలికాం మంత్రిత్వ శాఖలు, మీడియా, ఎంటర్‌ప్రెన్యూర్‌లు, పౌరసమాజాన్ని ఇప్పటికే జేపీ అభినందించారు. ■

# పలు ఎన్నికల, రాజకీయ సంస్కరణలను చర్చించిన సదస్సు
# తెలుగు రాష్ట్రాల్లో ఫిరాయింపుల్ని మాత్రం ప్రస్తావించని సీఈసీ



సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సయ్యద్ నసీం అహ్మద్ జైదీ. చిత్రంలో ఏడీఆర్ వ్యవస్థాపక సభ్యుడు అజిత్ రణడే

ఛార్జిషీటు ఆధారంగా అభ్యర్థులపై అనర్హత వేటు వేసే ప్రతిపాదన పరిశీలనలో ఉందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ డా॥ సయ్యద్ నసీం అహ్మద్ జైదీ తెలిపారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు తమ అఫిడవిట్‌లో తప్పుడు సమాచారాన్ని ఇచ్చినా, సమాచారం ఇవ్వకపోయినా క్రిమినల్ కేసులు పెట్టేందుకు కూడా చర్యలు చేపడుతున్నామన్నారు. చెల్లింపు వార్తల నేరానికి రెండేళ్లు జైలుశిక్ష విధించాలన్నారు. ఎన్నికల సంస్కరణలలో భాగంగా ఇలాంటి కొన్ని చర్యలను ఎన్నికల సంఘం రూపొందించిందన్నారు.

అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫాంస్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఈడబ్ల్యు) ఆధ్వర్యంలో 'ఎన్నికలు, రాజకీయ సంస్కరణల'పై 12వ జాతీయ వార్షిక సదస్సు హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో రెండు రోజులపాటు జరిగింది.

ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జైదీ మాట్లాడుతూ, ఎన్నికల బరిలో నిలబడే అభ్యర్థులపై ఓటర్లలో అవగాహన పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నామన్నారు. అభ్యర్థుల చరిత్రలను తెలియచేసే మొబైల్ యాప్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికలలో 60 లక్షల ఓట్లు 'నోటా'కు వచ్చాయన్నారు. ఆ తర్వాత పది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో 23లక్షల ఓట్లు వచ్చాయన్నారు. 2009లో దేశంలో వెయ్యి రాజకీయ పార్టీలుంటే, 2015 నాటికి ఆ సంఖ్య 1900కి చేరిందన్నారు. ఈ నాలుగేళ్లలోనే 753 పార్టీలు ఆవిర్భవించాయన్నారు. దేశంలో ఉన్న సుమారు 85 కోట్ల ఓటర్ల డేటా బేస్‌ని తయారు చేశామని, ఇక నుంచి కొత్త ప్రాంతంలో ఓటు నమోదు చేసుకుంటే పాత నియోజకవర్గంలోని ఓటు దానంతటదే తొలగిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దేశంలో జరిగే అన్ని ఎన్నికలకూ ఒకే ఓటర్ల జాబితా ఉండాలని ఎన్నికల సంఘం భావిస్తోందన్నారు.

కాగా, ఎన్నికలలో ఎవరు గెలిచినా ముఖ్యమంత్రి పార్టీలో చేరిపోతూ అసలు ఎన్నికలు ఎందుకు అనే పరిస్థితి నెలకొన్న తెలుగు రాష్ట్రాలలో జరిగిన ఈ ఎన్నికల సదస్సులో ఫిరాయింపులపై ఎన్నికల సంఘం స్పందించలేదు. ఫిరాయింపులపై నిర్ణయంలో స్పీకర్లు పక్షపాత ధోరణులతో వ్యవరిస్తున్నందున ఆ నిర్ణయాధికారాన్ని ఎన్నికల సంఘానికి ఇవ్వాలని లోక్‌సత్తా చాలాకాలంగా కోరుతున్న సంగతి తెలిసిందే.

### లైక్‌ల కోసం రాయొద్దు

ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల ప్రభావంపై సదస్సులో జరిగిన చర్చలో వివిధ ఆన్‌లైన్ మాధ్యమాల ప్రతినిధులు మాట్లాడారు. అరకొర పరిజ్ఞానంతో సామాజిక మాధ్యమాలలో కొందరు రాస్తున్నారని, ఇది సమాజానికి మంచిదికాదని పలువురు హితవు పలికారు. లైక్‌ల కోసం రాస్తున్న రాతలతో సామాజిక మాధ్యమాలు అసత్యాలకు, వదంతులకు నిలయాలుగా మారుతున్నాయన్నారు. ఏదైనా ఒక అంశంపై వామపక్ష భావజాలంతోనో, సంప్రదాయ ధోరణితనో రాస్తే ఆయా వర్గాల నుంచి మద్దతు లభిస్తోందని, వాస్తవాలు రాసే వారి పట్ల మొగ్గు తక్కువగా ఉందని పేర్కొన్నారు. లైక్‌ల కోసం పోస్టులు వద్దని, స్పష్టత లేని అభిప్రాయాలను రాయవద్దని సత్యాగ్రహ డాట్‌కామ్ ఎడిటర్ సంజయ్ దుబే కోరారు.

### ప్రజలు మౌనప్రేక్షకుల్లా ఉంటే డబ్బు రాజకీయం కొనసాగుతూనే ఉంటుంది

పంచాయతీ ఎన్నికల్లో కూడా డబ్బు ప్రవాహం కొనసాగుతోందని, కార్లు, బైకుల ర్యాలీలతో కోట్లు ఖర్చు పెడుతున్నారని, ఈ ఎన్నికల్ని పార్టీల ప్రమేయం లేకుండా జరపాలని ఏడీఆర్ ప్రతినిధి రిటైర్డ్ మేజర్ జనరల్ అనిల్

వర్మ అన్నారు. మద్యం ఎన్నికలలో తీవ్ర ప్రభావం చూపిస్తోందని బీహార్‌లో జరిగిన ఎన్నికలలో 70మంది చనిపోయారని బీహార్ ఎన్నికల నిఘా సభ్యుడు రాజీవ్‌కుమార్ తెలిపారు. డబ్బు పంపిణీపై ఎవరూ స్పష్టమైన ఆధారాలతో రావటం లేదని జార్ఖండ్ ఎన్నికల నిఘా సభ్యుడు సుందర్‌పాల్ అన్నారు. ప్రజలు మౌన ప్రేక్షకుల్లా ఉంటే ఎన్నికల్లో డబ్బు, కండబలం యథేచ్ఛగా కొనసాగుతుంటాయని నల్గొండ జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్ వి.పాండురంగారావు అన్నారు. పంచాయతీ ఎన్నికలకు తక్కువ సమయం కేటాయించాలని, ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రచారంలో పాల్గొనకుండా చేయాలని వరంగల్‌కు చెందిన మాజీ సర్పంచ్ కుసం రాజమౌళి పేర్కొన్నారు.

**సేవాభావంలేని బడా కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలు రాజకీయాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు**

వీసమెత్తు సామాజిక సేవ కూడా చేయని బడా కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలు రాజకీయాల్ని కబ్జా చేయటం పట్ల టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక హైదరాబాద్ రెసిడెంట్ ఎడిటర్ కింగ్‌షుక్ నాగ్ ఆందోళన వ్యక్తం చేశారు. వీరి వల్ల రాజకీయ వ్యవస్థ నాశనమవుతోందన్నారు. రాజ్యసభను రద్దు చేసి లోక్‌సభ సీట్లను 1500కి పెంచాలన్నారు. 1971 నుంచి లోక్‌సభ సీట్లను పెంచలేదన్నారు. జనాభా అంతరాల వల్ల అన్ని రాష్ట్రాలకూ సమాన ప్రాతినిధ్యం లభించే అవకాశం లేకపోవటంతో 2001లో జరగాల్సిన పార్లమెంటు దిగువసభ సీట్ల పెంపు వాయిదాపడిందన్నారు.

**ప్రాతినిధ్యం కంటే పార్టీలకు ప్రాధాన్యత ఇస్తున్నారు**

రాజకీయ పార్టీల, ముఖ్యమంత్రుల పనితీరును బట్టి ఓటర్లు ఎంచుకుంటున్నారని ది హిందూ పత్రిక అసోసియేట్ ఎడిటర్ శ్రీనివాసన్ రమణి అన్నారు. భారతీయ ప్రజాస్వామ్యాన్ని ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అనే కంటే పార్టీల ప్రజాస్వామ్యం అనటం సబబు అన్నారు. పారదర్శకతను, రాజకీయ పనితీరును మెరుగుపరిచేలా మన చట్టసభ వ్యవస్థలను ప్రక్షాళన చేసుకోవటం అవసరమన్నారు.

**వేగంగా జరగాల్సిన సంస్కరణలివి**

ప్రజలకు సరైన ప్రతినిధులు లభించేలా ఎన్నికల సంస్కరణల్ని వేగంగా తీసుకురావాల్సి ఉందని, గత పాతి కేళ్లుగా ఇందుకోసం పోరాడుతున్నామని ఫౌండేషన్ ఫర్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఎలక్షన్స్ (ఫేమ్) ప్రధాన కార్యదర్శి కేజేరావు అన్నారు. ■

## నిజమైన ప్రజాస్వామ్యం కోసం అధికార వికేంద్రీకరణ కావాలి : జేపీ

నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించటానికి, పరిపాలనను సంస్కరించటానికి అధికార వికేంద్రీకరణతో స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం కీలకమని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. భారత్‌లో ఎన్నికల వ్యవస్థ సమూల ప్రక్షాళనపై ఏడీఆర్, ఎన్ఈడబ్ల్యు సదస్సులో మాట్లాడుతూ, కోట్లు ఖర్చుపెట్టగలిగిన కొంతమందికి మాత్రమే అవకాశమిస్తున్న ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో డబ్బు స్థానంలో నిబద్ధత, సమర్థతను అర్హతలుగా మార్చాలని జేపీ అన్నారు. నిజాయతీ రాజకీయానికి నిజాయతీ డబ్బును అభ్యర్థులు సమకూర్చుకునే మార్గాలను అందుబాటులోకి తెచ్చి, విధానాలు, విలువలకు వేదికలుగా ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలు మనుగడసాగించే అవకాశాన్ని పటిష్టం చేయాలన్నారు. తప్పనిసరి ఓటింగ్‌పై కూడా ఆలోచన జరగాలని, ఓటు వేయకపోతే మునిసిపల్ పన్ను రూపంలో ఓ రూ.100 జరిమానా ఉంటే నైతిక ఒత్తిడిగా పనిచేస్తుందన్నారు. బ్రిటన్‌లో భారత్‌లో ఉన్న ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ సిస్టం (ఎఫ్‌పీటీపీ)తో పాటు వివిధ రకాల ఎన్నికల పద్ధతులున్నాయని, ప్రస్తుత భారతదేశ



పరిస్థితుల్లో ఎఫ్‌టీపీని మార్చి ప్రతి ఓటుకూ ప్రాతినిధ్యం లభించే దామాషా ఎన్నికల పద్ధతిని తేవాలని జేపీ అన్నారు.

ఏడీఆర్ వ్యవస్థాపక సభ్యులు ఆచార్య త్రిలోచన్ శాస్త్రి, డా॥ అజిత్ రణడే, ట్రస్టీ విపుల్ ముద్గల్, తెలుగు రాష్ట్రాల ఎలక్షన్‌వాచ్ సమన్వయకర్త డి. రాకేష్ రెడ్డి, ఎంసీహెచ్ఆర్‌డీ సంయుక్త డీజీ అనితా బాలకృష్ణన్, వివిధ ఆన్‌లైన్ సామాజిక మాధ్యమాల ప్రతినిధులు అభినందన్ సేక్రీ, నిఖిల్ పాహ్వా తదితరులు మాట్లాడారు. ■

# అరచేతి స్వర్గం 'ఆదాయ భద్రత'

- దేవిందర్ శర్మ



దేశంలోని 17 రాష్ట్రాలలో వ్యవసాయ కార్యకలాపాల నుంచి రైతుకి వచ్చే సగటు వార్షిక ఆదాయం రూ.20,000. రైతు సొంత వినియోగం కోసం ఉంచుకునే ఉత్పత్తుల విలువను కూడా కలుపుకుని లెక్కించిన సగటు ఇది. మరో విధంగా చెప్పాలంటే, ఈ రాష్ట్రాలలో రైతుకు సగటున నెలకు రూ.1,666ల అత్యల్ప వేతనం మాత్రమే లభిస్తుంది.

మీరు వింటున్నది నిజమే. రూ.1,666.

ఇప్పుడిక మీరే ఆ స్థానంలో నిలిచి చూడండి. మీరే ఒక రైతయితే నెలకు మీకు రూ.1,666 ఆదాయం మాత్రమే వస్తుంటే ఏం చేస్తారు? మరో ఐదేళ్లు వేచి చూస్తారా? ఆశను నమ్ముకునే బతుకుతూ, ఆ శుభోదయం ఎన్నటికో కదా.. అని ఆలోచిస్తూ గడుపుతారా?

**ఐదేళ్లకు అక్కడికే చేరుస్తామని హామీ**

ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటులో 2016-17 బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ.. "మనం 'ఆహార భద్రత'ను మించి ఆలోచించి, రైతుకు 'ఆదాయ భద్రత' ఉన్నదనే భావనను కలిగించాల్సిన అవసరం ఉంది".. అంటున్నప్పుడు ఊపిరి బిగబట్టి చూశాను. అయితే ఆయన 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని మాత్రం వాగ్దానం చేశారు. అది ఇంకా ఐదేళ్ల సుదూరంలో ఉంది. నా ఆశలన్నీ ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి.

రైతులు మరో ఐదేళ్లు ఆగాలని ఆర్థికమంత్రి కోరుతున్నారు. ఐదేళ్ల తర్వాత, ఆ వాగ్దానాన్ని నెరవేర్చినా, ఆ 17 రాష్ట్రాలలోని రైతుల నెలసరి ఆదాయం రూ.3,332కు చేరుతుంది. నిరంతర కృషితో ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయటంలో సఫలమైందని సగర్వంగా 2022 ఆర్థిక సర్వే బడాయి పోతుందని అనుకుంటున్నాను. నిజమే. ఎంత గొప్ప 'విజయం' అని ఆర్థికవేత్తలూ అంటారు. కానీ ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేసి చూస్తే అప్పటికి ఆ రూ.3,332 సైతం నేడు రైతుకు లభిస్తున్న రూ.1,666కు సమానమే అవుతుంది. ప్రభుత్వం కల్పించదలచుకున్న 'ఆదాయ భద్రత ఉన్నదనే భావన' ఖచ్చితంగా ఇదే.

వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉన్న సమయంలో, ఆర్థిక సర్వే సైతం సవివరంగా పేర్కొన్నట్టు గత కొన్నేళ్లుగా వ్యవసాయరంగం దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో.. ప్రభుత్వం శస్త్రచికిత్స లాంటి తక్షణ చర్యలేమైనా చేపడుతుందేమోనని నేను ఆశించాను. రైతు ఆత్మహత్యల పరంపర సగటున రోజుకు 42 నుంచి, 2015లో రోజుకు 52కు గంతు వేయటాన్ని పరిగణలోకి తీసుకుంటే.. వ్యవసాయరంగం పట్ల తక్షణమే శ్రద్ధ చూపాల్సిన ఆవశ్యకత ఉంది. బడ్జెట్ ప్రసంగంలో ఓ 50 సార్లు వ్యవసాయరంగాన్ని

గురించి ప్రస్తావించినంత మాత్రాన తీవ్ర నిర్లక్ష్యానికి, ఉపేక్షకి గురైన ఆ రంగానికి ఒరిగేదేమీ లేదు.

**ఉత్పాదకత తక్కువా?**

పంటల దిగుబడులను పెంచడం ఎలాగో రైతులకు తెలియకపోవటం వల్ల వారి ఆదాయాలు ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోవటం లేదు. ఉత్పాదకత ముఖ్యమైనదే. కానీ దానికి తగ్గట్టుగా లాభసాటి ధరలు లేకపోతే రైతు ఆదాయం దెబ్బతినిపోతుంది. వ్యవసాయంలో దేశంలోనే అగ్రశ్రేణి రాష్ట్రమైన పంజాబ్‌నే ఉదాహరణగా తీసుకోండి. పంజాబ్ రైతులు 99శాతం నీటి పారుదల సదుపాయం గల ప్రాంతంలో హెక్టారుకు 4,500 కిలోల గోధుమను, 6,000 కిలోల వరిని పండిస్తున్నారు. ఇది చాలా అధిక ఉత్పాదకతే. ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్ లక్ష్యాలుగా పేర్కొన్న సాగునీటి సదుపాయాల విస్తరణ సహా అన్ని సూచికలూ ఇప్పటికే అక్కడ ఉన్నాయి.

అయినాగానీ, కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (సీఏసీపీ) లెక్కల ప్రకారం, ఒక హెక్టారులో గోధుమ లేదా వరి సాగు చేస్తే (సాధారణ పంటల పద్ధతినే అనుసరించినట్టయితే) లభించే నికర ఆదాయం దాదాపు రూ. 36,000. అంటే నెలకు రూ.3,000 మాత్రమే. 7వ పే కమిషన్ అమలులోకి వచ్చాక ఒక బంట్రోతుకు లభించే నెలసరి మూలవేతనం రూ.18,000తో దీన్ని పోల్చి చూడండి. కొత్తగా నియమించిన బంట్రోతు సైతం ఉద్యోగంలో చేరిన వెంటనే ఆదాయపు పన్ను చెల్లింపుదారుల పరిధిలోకి వచ్చినా నేను ఆశ్చర్యపోను.

కాబట్టి, భారత వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు అల్ప ఉత్పాదకతేనని ఆర్థిక సర్వే అనడం తప్పు. అసలు మౌలిక సమస్య.. ఆర్థిక మంత్రి సరిగ్గానే చెప్పినట్టు 'ఆదాయ భద్రతే'.

**రైతు ఊసెత్తితేనే తిరస్కార భావన**

బడ్జెట్ ప్రసంగంలో 'వ్యవసాయం' అనే పదాన్ని కేవలం నొక్కి చెప్పినందుకే చాలా టీవీ ఛానళ్ల చర్చా బృందాల సభ్యులు తిరస్కారభావంతో నిర్ఘాంతపోవటం గమనించాను. వ్యవసాయం లాభసాటి కాకుండా పోవడానికి కారణం అది అనుత్పాదకమైనది కావడం కాదు. ఇన్నేళ్లుగానూ ఉద్దేశపూర్వకంగానే దాన్ని పేదరికంలో ఉంచేస్తుండటం వల్లనే అనే విషయం వారికి అర్థం కాలేదు. 1970లో రైతులకు క్వింటాలుకు (100కిలోలు) గోధుమ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూ.76 లభించేది. 45 ఏళ్ల తర్వాత, 2015లో గోధుమ మద్దతు ధర క్వింటాలుకు రూ. 1450కి పెరిగింది. అంటే 19 రెట్లు పెరిగింది.

అదేకాలంలో ప్రభుత్వోద్యోగాల మూల వేతనం (డీఏతో కలిపి) 120–150 రెట్లు పెరిగింది. కళాశాల అధ్యాపకులు, విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్ల వేతనాలు 150 నుంచి 170 రెట్లు, పాఠశాల ఉపాధ్యాయుల వేతనాలు 280 నుంచి 320 రెట్లు, దేశంలోని అత్యున్నత స్థాయి ఎగ్జిక్యూటివ్ అధికారుల వేతనాలు ఏకంగా 1,000రెట్లు పెరిగాయి. గత 45 ఏళ్లలో ఉద్యోగుల వేతనాలు అసాధారణంగా పెరిగినప్పటికీ, రైతులు తమకు న్యాయంగా రావాల్సిన వాటి కోసమే అల్లాడవలసి వస్తోంది. గోధుమ ధర కూడా అదే కొల్లబద్దతో పెరిగితే కనీసం 100 రెట్లు పెరిగి ఉండేది. గోధమ కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,600 కావాల్సింది. గోధుమ ధర ఆ రీతిన పెరిగితే ఆహార ద్రవ్యోల్బణం చుక్కలనంటుంతోందనేది దీనికి ప్రతివాదన. కాబట్టి ఇన్నేళ్లుగానూ కేవలం ఆహార ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం కోసమే రైతులను శిక్షిస్తున్నారు.

**'రైతుకు యాభైశాతం' లాభం ఏదీ?**

అందుకే ఎన్డీయే ప్రభుత్వం, రైతుకు ఉత్పత్తి వ్యయంపై 50శాతం లాభం ఇస్తామన్న వాగ్దానం నుంచి వెనక్కు మళ్లింది. కనీస మద్దతు ధర పెరుగుదలను బట్టి చూస్తే రైతు ఆదాయం నామమాత్రంగా ఏటా 3.2 నుంచి 3.6శాతం మేరకు పెరుగుతూ వచ్చింది. సంఘటిత రంగంలోని ఇతరులంతా భారీగా వేతనాలలో పెరుగుదలను అందుకుంటున్నా, రైతులను ఉద్దేశపూర్వకంగా విస్మరించారు.

ప్రభుత్వం, తనకు ఉన్న 'రైతు వ్యతిరేక' ముద్రను తొలగించుకోవటానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నాను. అందుకోసం వ్యవసాయరంగంపై ప్రభుత్వ మదుపులను భారీగా పెంచటంతోపాటు, వ్యవసాయ ఆదాయాన్ని వేగంగా పెంపొందించటానికి చర్యలను కూడా చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వం గనక, వ్యవసాయదారులకు రూ.3లక్షల కోట్ల ఆర్థిక బెయిలవుట్ ప్యాకేజీ (ఉద్దీపన పథకాన్ని) ప్రకటించి, దానిని అనుసరించి రైతులకు నెలకు తప్పక ఇంటికి తీసుకుపోగల ఆదాయం ప్యాకేజీకి హామీని కల్పించడానికి జాతీయ రైతు ఆదాయ కమిషన్‌ను ఏర్పరిస్తే.. ఆర్థిక వృద్ధి చక్రాలు వేగంగా తిరిగి ఉండేవి. 60 కోట్లమంది రైతులకు 'ఆదాయ భద్రత' లభించడమే కాదు, భారీ ఎత్తున దేశీయ డిమాండ్‌ను కూడా సృష్టించి పారిశ్రామిక వృద్ధిని పునరుజ్జీవింప చేసి ఉండేది. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ (అందరితో కలిసి అందరికీ సౌభాగ్యం)ను నిజంగానే సాధించగల ఔషధం ఇది మాత్రమే . ■


(సాక్షి సౌజన్యంతో)

# ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2016-17

అవిభక్త ఆంధ్రప్రదేశ్ జనాభాలో 58.32శాతం మంది ఉన్నా, నూతన ఆంధ్రప్రదేశ్ ఆదాయం మాత్రం అవిభక్త రాష్ట్రానికి వచ్చిన దాంట్లో కేవలం 46శాతం మాత్రమే ఉందని ఏపీ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో పేర్కొంది. రూ.16,200 కోట్ల రెవిన్యూ లోటు (ఇది కేవలం పాలనావ్యయమా? లేక తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన అసంబద్ధ హామీల వల్ల పెరిగిన ఖర్చా అనేది స్పష్టం చేయలేదు) ఉంటే కేంద్రప్రభుత్వం కేవలం రూ.2,303 కోట్లు మాత్రమే విడుదల చేసిందని తెలిపింది.

రూ.1,35,688.99 కోట్లతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2016–17 బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో ప్రణాళికేతర వ్యయం రూ.86,554.55కోట్లు. గత ఏడాది కంటే ఈసారి బడ్జెట్ 20.03శాతం ఎక్కువ. ప్రణాళికేతర వ్యయం 10.07 శాతం, ప్రణాళికా వ్యయం 42.78శాతం పెరిగాయి. ఆర్థికలోటు రూ.20,497.15 కోట్లుగా అంచనా వేశారు. 2015లో ప్రతిపాదించిన రూ.1,13,049 కోట్ల బడ్జెట్‌లో 99.26శాతం ఖర్చు చేశామని తెలిపింది. 2016 బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు రూ.3,600 కోట్లు ప్రతిపాదించారు. ఈ మొత్తాన్ని కేంద్రం సమకూరుస్తుందని తెలిపారు. ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేందుకు రూ.3,135.25 కోట్లు కేటాయించారు. గతేడాది కంటే ఇది 57శాతం ఎక్కువ. 2016–17లో తోటపల్లి బ్యారేజీ, పోలవరం కుడికాలువ, గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల్ని పూర్తి చేస్తామని, వంశధార రెండోదశ, వెలుగొండ ప్రాజెక్టు, గుండ్లకమ్మ జలాశయం, పోలవరం ఎడమకాలువల్ని 2018 నాటికి, పోలవరం తొలిదశని 2018 జూన్ నాటికి పూర్తి చేస్తామని ప్రభుత్వం తెలిపింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో రూ.11,500కోట్ల పారిశ్రామిక పెట్టుబడులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఏపీ ప్రభుత్వం బడ్జెట్‌లో తెలిపింది. గత ఏడాది వివిధ పరిశ్రమలలో రూ.9,505 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 76,818 ఉద్యోగాలను సాధించగలిగామని పేర్కొంది. మొత్తంగా ఈసారి బడ్జెట్‌లో పారిశ్రామికరంగానికి రూ.975.77 కోట్లు కేటాయించారు. కాపు కార్పొరేషన్‌కి రూ.1000కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కి రూ.65 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. గృహనిర్మాణ వ్యయం సాధారణ తరగతికి 6రెట్లు, దళిత, గిరిజన లబ్ధిదారులకు 8 రెట్లు పెంచారు. రాజధాని అమరావతి అభివృద్ధికి ప్రభుత్వ వాటాగా రూ.1500 కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయించారు. కృష్ణా పుష్కరాలకు రూ.250 కోట్లు, పర్యాటకాభివృద్ధికి రూ.227.74 కోట్లు ప్రతిపాదించారు.

**ఆంధ్రప్రదేశ్ 2016 బడ్జెట్‌లోని మరికొన్ని అంశాలు:**




- 20వేల ఉద్యోగాల భర్తీ
- కొత్తగా యువత సాధికారత సంస్థ... రూ.250 కోట్లు కేటాయింపు
- ఎస్సీ ఉపప్రణాళికకు రూ.8,724 కోట్లు
- గిరిజన ఉపప్రణాళికకు రూ.3,100 కోట్లు
- మైనారిటీలకు 702కోట్లు
- బీసీ సంక్షేమానికి 8,832 కోట్లు
- అమరావతిలో సైన్స్ సిటీ
- విశాఖ, అనంతపురంలో ప్రాంతీయ సైన్స్ కేంద్రాలు
- తిరుపతి, విశాఖ, విజయవాడల్లో భారీ సమావేశ కేంద్రాలు
- ఓర్వకల్లులో 27,788 ఎకరాల్లో మెగా ఇండస్ట్రియల్ హబ్

- దొనకొండలో 5,779 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్
- 2016-17లో వృద్ధి అంచనా 15శాతం
- భోగాపురం, దగదర్తి, ఓర్వకల్లు, నాగార్జునసాగర్, దొనకొండల్లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు
- అన్ని మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రెండు వరసల రహదారి
- 2022 నాటికి గ్రామాల్లో 10లక్షలు, పట్టణాల్లో 30లక్షల ఇళ్ల నిర్మాణం
- ఈ ఏడాది 4.6లక్షల ఇళ్లకు విద్యుత్తు
- రెండేళ్లలో 4,800 మెగావాట్ల అదనపు విద్యుదుత్పత్తి
- ఈ ఏడాది కృష్ణా, ఉభయ గోదావరిలో పట్టణ గ్యాస్ పంపిణీ
- ఏడాది చివరికల్లా ఇంటింటికీ ఇంటర్‌నెట్

## రూ.16,250 కోట్లతో వ్యవసాయ బడ్జెట్

రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగాలలో ఉత్పాదకతను పెంచి మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకుని రైతు నిలదొక్కుకోవటంపై వ్యవసాయ బడ్జెట్‌లో దృష్టి సారించామని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. ప్రాథమిక రంగ మిషన్ కింద రూ. 16,250.58 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ని సభలో సర్కారు ప్రవేశపెట్టింది. వ్యవసాయరంగంలో మాత్రం కేటాయింపులు తక్కువ. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ. 4513 కోట్లు వ్యవసాయ ప్రణాళిక కింద కేటాయించగా ఈ ఏడాది రూ. 1311.77 కోట్లకే పరిమితమైంది.

# రోజా సస్పెన్షన్‌పై ఆ ముగ్గురే తేల్చాలి, శాసనసభలో కోర్టుల జోక్యం ప్రజాస్వామ్యానికే ప్రమాదం: లోక్‌సత్తా

ఆంధ్రప్రదేశ్ శాసనసభా కార్యకలాపాల్లో సమస్యల పరిష్కారానికి కోర్టులను ఆశ్రయించటం అసమర్థతకు, దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని, శాసన వ్యవస్థలో కోర్టుల జోక్యం పెరిగితే ప్రజాస్వామ్యం క్షీణించి ముమ్మందు ప్రమాదకర పరిణామాలు వస్తాయని లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. వైకాపా సభ్యురాలు రోజాపై ఏడాది సస్పెన్షన్, కోర్టు ఉత్తర్వులు, తదనంతర పరిణామాలపై బాబ్జీ స్పందిస్తూ.. రోజాపై సస్పెన్షన్ తొందరపాటుతనంతో కూడినది, దురదృష్టకరమైనదే అయినా ఆ అంశాన్ని పరిష్కరించుకోవాల్సింది శాసనసభ పరిధిలోనే తప్ప కోర్టుల్లో కాదన్నారు. స్పీకర్, సభానాయకుడు, ప్రతిపక్ష నేత బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ)తో కూర్చుని ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాలన్నారు. కోర్టు తీర్పులపై శాసనసభ చర్చించవచ్చుగానీ సభ వ్యవహారాల్లో కోర్టుల జోక్యం అవాంఛనీయమని బాబ్జీ స్పష్టంచేశారు. ఎవరిని చూసి ప్రజలు, విద్యార్థులు గర్వంగా బతకాలనుకుంటారో ఆ వ్యవస్థలో కీలకమైన నాయకులే రోడ్ల మీద పడి అధికారం, అక్రమ సంపాదన కోసం శాసనసభ వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారని, తలదించుకునేలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికైన సభ్యులకు సభ వ్యవహారాలలో కోర్టు మార్గనిర్దేశనం చేయాలంటే, ఇక వాళ్ల ఎన్నికవటం అనవసరమని, ప్రజాస్వామ్యం ఉండదని అన్నారు. సభ అంతర్గత వ్యవహారాలలో ఎంత తీవ్రస్థాయి సమస్యనైనా స్పీకర్, సభానాయకుడు, ప్రతిపక్ష నేత – వీళ్లు ముగ్గురి మధ్య సమన్వయంతోనే పరిష్కరించుకోవాలన్నారు. అలాగే కోర్టు జోక్యం లేదు కాబట్టి ఇష్టమొచ్చినట్టు వ్యవహరించే హక్కూ సభ్యులకు ఉండదని బాబ్జీ అన్నారు. ఇందుకోసం సభలు ఎథిక్స్ కమిటీ వంటి ఏర్పాట్లతో ప్రవర్తనా నియమావళిని రూపొందించుకుని అమలు చేయాలని బాబ్జీ అన్నారు. చట్టసభలో ఎలా వ్యవహరించాలో, సమస్యల్ని ఎలా పరిష్కరించుకోవాలో ప్రకాశం పంతులు, తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్న, పుచ్చలపల్లి సుందరయ్య, డా॥ జయప్రకాష్ నారాయణ్ వంటి వారిని చూసి నేర్చుకోవాలన్నారు. పార్లమెంటు, శాసనసభ ఒక హోదా గల సభలని, ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదికలని గుర్తుచేశారు.


ఈవేళ ప్రతిపక్ష పార్టీ కోర్టుకెళితే రేపు అధికార పార్టీ వెళుతుందని, ఇలా శాసనసభలో కోర్టుల పాత్రని పెద్దది చేయటం వల్ల ప్రజాస్వామ్యానికే ఎసరు వస్తుందని బాబ్జీ అన్నారు. కోర్టుల పాత్ర కోర్టులు చేయాలి, చట్టసభ పాత్ర చట్టసభ చేయాలి, ఒకరి వ్యవహారాల్లో ఇంకొకరు జోక్యం చేసుకోవటం తగదని అన్నారు. సభలో ఓ పార్టీ తీరు పట్ల అభ్యంతరాలుంటే మీడియా ద్వారా, ఆందోళనల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చున్నారు. ఇప్పటికైనా స్వార్థ రాజకీయాల కోసం సభాసమయాన్ని వృధా చేయకుండా జాతీయ రహదారులపై మద్యం దుకాణాల తొలగింపు, ప్రయివేటు బస్సు ఆపరేటర్ల ఆగడాలు, రేషన్ కార్డుల్లో అక్రమాలు, పెరుగుతున్న అవినీతి వంటి సమస్యలపై చర్యలు, చట్టాలపై సభ్యులు చర్చించాలని బాబ్జీ డిమాండ్ చేశారు.

# తెలంగాణ బడ్జెట్ 2016–17

సాంకేతికంగా మూడోదైనా 2016-17 బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్రానికి తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌గా చెప్పవచ్చు. తాజా బడ్జెట్‌లో సాగునీటి రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. రూ. 1.30 లక్షల కోట్ల బడ్జెట్‌లో దాదాపు రూ. 25వేల కోట్లను ఈ రంగానికే కేటాయించింది. గతేడాది ఈ రంగం వ్యయం రూ. 8,500 కోట్లు మాత్రమే. పాలమూరు, కాళేశ్వరం, భక్త రామదాసు ఎత్తిపోతల ప్రాజెక్టులకు తాజా బడ్జెట్‌లో ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. రూ. 15వేల కోట్ల దాకా కేటాయించారు. ప్రణాళికా వ్యయాన్ని భారీగా పెంచి సాగు లక్ష్యాల సాధనకు పట్టుదలతో ఉన్నామని ప్రభుత్వం తెలియచేసింది. చెరువుల పునరుద్ధరణకు ప్రారంభించిన 'మిషన్ కాకతీయ' పథకాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. సాగునీటి వాటాలోనే సుమారు రూ. 2వేల కోట్లు చెరువుల పునరుద్ధరణకు వెచ్చిస్తారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రచారం చేసుకుంటున్న మిషన్ భగీరథ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాలకు బడ్జెట్ వెలుపలి నుంచి నిధుల్ని సమీకరిస్తామని ప్రభుత్వం సభలో తెలిపింది. రూ. 40వేల కోట్లతో మొదలుపెట్టిన మిషన్ భగీరథకు హడ్కో, నాబార్డు, కెనరా బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటామని పేర్కొంది. ఇప్పటికే మంజూరు చేసిన 60వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లతోపాటు ఈ ఏడాది పట్టణాల్లో లక్ష ఇళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లను హడ్కో సాయంతో నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పింది. హైదరాబాద్‌లో నిర్మించే నాలుగు అధునాతన ఆసుపత్రులకు నెదర్లాండ్స్‌లోని రాబో బ్యాంకు సాయం తీసుకుంటామని ప్రకటించింది.

ప్రణాళికా వ్యయానికి సంబంధించిన కేటాయింపుల్లో సాగునీటి రంగం తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ఎక్కువ నిధుల్ని కేటాయించింది. వీటికి రూ. 13,355కోట్లు ప్రణాళికా వ్యయంలో చూపింది. తర్వాత గ్రామీణాభివృద్ధికి రూ. 6,564.96 కోట్లు, రోడ్లు, రవాణా రంగానికి రూ. 4,711 కోట్లు, వైద్యారోగ్యానికి రూ. 2,462.83 కోట్లు ప్రణాళికా పద్దు కింద కేటాయించింది. నగరాభివృద్ధికి రూ. 2,141.75 కోట్లు, వ్యవసాయానికి రూ. 2,111.11 కోట్లు, విద్యారంగానికి రూ. 1,780.44 కోట్లు కేటాయించింది. గత ఏడాదితో పోలిస్తే వ్యవసాయానికి, విద్యుత్తు రంగానికి, తాగునీటి





సరఫరాకి నిధుల కేటాయింపు తగ్గింది.

**నిజాం నవాబు లెక్కన ప్రత్యేక అభివృద్ధి నిధి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒరవడిలోనే కేంద్రీకృత పాలనలోనే సాగుతున్న కేసీఆర్ ప్రభుత్వం అందులో భాగంగా ఈసారి ప్రత్యేక అభివృద్ధి నిధిని ఏర్పాటు చేసి రూ. 4,675 కోట్లు కేటాయించింది. అనుకోని అవసరాలకు కేటాయించేందుకు వీలుగా వీటిని ముఖ్యమంత్రి, మంత్రులు, జిల్లా కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉంచుతామని చెబుతున్నా, అంతా ముఖ్యమంత్రి చేతుల్లోనే ఉంటుందనేది స్పష్టం. ముఖ్యమంత్రి అజమాయిషీలో ఉండేలా రూ. 5వేల కోట్లతో నిధిని ఏర్పాటు చేయాలని ఇప్పటికే కేబినెట్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. నిజాం నవాబుగారు బగ్గీ పర్యటనల్లో బంగారు నాణేలు తీసుకెళ్లి నచ్చిన బిచ్చగాళ్లకు పంచినట్టు ముఖ్యమంత్రిగారు పర్యటనలకు వెళ్లినప్పుడు అలా తన ఖాతాలోని నిధి నుంచి కాసిని డబ్బు పంచుతారన్న మాట. ఇదే డబ్బుని తలసరి రూ. 1000 చొప్పున స్థానికంగా పంచాయితీలకు, మునిసిపాలిటీలకు వార్డు స్థాయిలో కేటాయిస్తే జన జీవితాల్లో అద్భుత మార్పునకు పునాది ఏర్పడి ఉండేది. ప్రజలు స్వయంపాలనతో తమ జీవితాల్ని మెరుగు పరుచుకుంటూ తలెత్తుకుని బతికే జీవితం దిశగా అడుగులు వేసేవారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, రామగుండం నగర పాలక సంస్థలు, అన్ని పురపాలక సంఘాలకు కలిపి రూ. 1200 కోట్లు ఇవ్వటం కూడా ముఖ్యమంత్రి చుట్టూ తిరిగే కేంద్రీకృత పాలనలో భాగమే తప్ప అధికార వికేంద్రీకరణతో స్థానిక ప్రభుత్వాలను అభివృద్ధి చేసే ఫెడరల్ సంస్కృతి కాదు.

బ్రాహ్మణ సంక్షేమ నిధికి రూ. 100 కోట్లు, కళ్యాణ లక్ష్మి




పథకాన్ని బీసీలతో సహా అన్ని వర్గాల పేదలకీ విస్తరించటం, కాలేజీలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు సన్నబియ్యం ఈసారి బడ్జెట్‌లో కొత్తగా వచ్చి చేరినవి. ఆసరా పింఛన్లకు ఈ ఏడాది కూడా రూ. 4,693 కోట్లు కేటాయించారు. రైతుల రుణమాఫీ పథకానికి 4,250 కోట్లు, విద్యుత్తు సబ్సిడీకి 4,470 కోట్లు, బియ్యం సబ్సిడీకి రూ. 2,200 కోట్లు బడ్జెట్‌లో ఇచ్చారు.

### పథకాల కుదింపు

మొదటి రెండు బడ్జెట్‌లలో ఖర్చులపై అవగాహన లేక 37, 14శాతం మేర కోతలు విధించాల్సి వచ్చింది. ఈసారి బడ్జెట్‌లో మొత్తం 840 పథకాలలో పెద్దగా అవసరంలేని 379 పథకాలను తొలగించారు. కొన్నిటిని తెలంగాణ పరిస్థితులకనుగుణంగా మలిచారు.

### పాతపంథాలోనే అతి అంచనాలు


వృద్ధి రేటు పెరుగుతున్నందున రాబడులకు ఢోకా ఉండదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆదాయంపై సర్కారు అతి అంచనాలు వేసినట్టు గత బడ్జెట్‌లలోనే స్పష్టమైంది. భూములపై గత రెండేళ్లలో పెద్దగా ఆదాయం రానప్పటికీ ఈసారి బడ్జెట్‌లో రూ. 10,900కోట్లు చూపించారు. హైదరాబాద్‌లో వేలకోట్ల విలువైన 380 ఎకరాల భూమి అందుబాటులో ఉందని పేర్కొంది. అలాగే కేంద్రప్రభుత్వం నుంచి గత బడ్జెట్‌లో ఎంతో ఆశించినా రూ. 450 కోట్లు రాగా, ఈసారి కూడా భారీగా 3,100 కోట్లు వస్తాయని చూపారు. కొత్త పన్నుల్ని వేయకుండానే రాబడిని ఆర్జిస్తామని ప్రభుత్వం ధీమాగా చెబుతోంది.

### ఇప్పటివరకూ రూ. 1 లక్ష కోట్ల అప్పు

రాష్ట్రంలోని తలసరి అప్పు 2017 మార్చి నాటికి రూ. 35,377కు చేరుకోనుంది. ఉమ్మడి రాష్ట్రంలోని అప్పుల వాటా, ఆ తర్వాత ఇంతవరకు తెచ్చినవి కలిపి రూ. లక్ష కోట్లు కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో మరో రూ. 23,467 కోట్లు అప్పు తేవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీంతో వచ్చే ఏడాది నాటికి అప్పు రూ. 1,213,821 కోట్లకు చేరుతుంది. రాష్ట్ర జీడీపీలో 3.5శాతం మేర అప్పులను సర్కారు బడ్జెట్‌లో అంచనా వేసింది. దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం రావాల్సి ఉంది.

### మద్యం ఆదాయం రూ.14,461 కోట్లు

ఆంధ్రప్రదేశ్‌లోలాగే తెలంగాణ ప్రభుత్వం కూడా మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చేసుకుంది. 2016-17లో మద్యం అమ్మకాల ద్వారా రూ. 14,461 కోట్లు సమకూర్చుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో వ్యాట్ ద్వారా రూ. 9,618 కోట్లు, లైసెన్సు రుసుములు, జరిమానాలు, ఇతర మార్గాల ద్వారా రూ. 4,543 కోట్లు అంచనా వేశారు.




### జీహెచ్‌ఎంసీపై మౌలిక వసతుల భారం

హైదరాబాద్ నగరంలో మౌలిక వసతుల బాధ్యతను ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకే అప్పచెప్పింది. బల్దియాకు కేవలం రూ. 70కోట్ల నిధులను కేటాయించింది. నగరంలో ఆకాశమార్గాలతో కూడిన రోడ్ల విస్తరణ ప్రాజెక్టుకు మొదటిదశలో రూ. 1350కోట్లు అవుతాయని అంచనా. దీంతోపాటు రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణంలో కూడా జీహెచ్‌ఎంసీ వాటా చెల్లించాలి అంటే బల్దియాకు ఆర్థిక కష్టాలు తప్పకపోవచ్చు. బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ వంటి అంతర్గత మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఇంత హోరాహోరీగా ప్రచారం చేసి గెలిచిన మేయర్, కార్పొరేటర్లు చివరికి ఉత్సవ విగ్రహాలుగా మిగిలేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

తెలంగాణ రాష్ట్ర 2016 బడ్జెట్ మొత్తం రూ. 1,30,415.87 కోట్లు కాగా, ప్రణాళికా వ్యయం రూ. 67,630.73 కోట్లు, ప్రణాళికేతర వ్యయం రూ. 62,785.14 కోట్లు. రెవిన్యూ మిగులు రూ. 3,718. 37 కోట్లుకాగా, ద్రవ్యలోటు రూ. 23,467.28 కోట్లు. ■

# ఏపీకి ప్రత్యేక హోదాపై నాటకాలాడుతున్న బీజేపీ, కాంగ్రెస్, తెదేపా

## రాష్ట్రానికి ఇవ్వలేకపోతే సీమ, ఉత్తరాంధ్ర సహా వెనకబడిన జిల్లాలకైనా ఇవ్వండి: లోక్‌సత్తా





ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదాపై బీజేపీ, కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు నాటకాలాడుతున్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. జనవరి 18, 2014న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రతిపాదించిన ప్రత్యేక హోదా అంశాన్ని విభజన చట్టంలో చేర్చకుండా కాంగ్రెస్ పార్టీ, ఆనాడు మద్దతిచ్చి ఇప్పుడు దాటవేస్తున్న బీజేపీ, తెలుగుదేశం పార్టీలు తెలుగు ప్రజల్ని దగా చేస్తున్నాయన్నారు. “ఈవేళ ఢిల్లీ వెళ్లి ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎందుకు ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చలేదు? కాంగ్రెస్ పార్టీ చట్టంలో చేర్చకపోతే లోక్‌సభలో బీజేపీ ఎందుకు చోద్యం చూసింది?” అని ప్రశ్నించారు. రాజ్యసభలో పదేళ్ల ప్రత్యేక హోదా కోసం హంగామా చేసి, ఆ తర్వాత ఎన్నికల ప్రచార సభల్లో ఊదరగొట్టిన బీజేపీ నేత, ప్రస్తుత కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు ఇప్పుడు ప్లేటు ఫిరాయిస్తున్నారన్నారు. ఓటుకు కోట్లు వంటి కేసులు, రాజధాని చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి విదేశీ లావాదేవీలు లాంటి స్వార్థ అవసరాల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంపై ప్రత్యేక హోదా విషయంలో ఒత్తిడి తేవటం లేదన్నారు. రాజధాని అమరావతి శంకుస్థాపన కోసం వచ్చినప్పుడు మాట మాత్రం కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీని ప్రత్యేక హోదా కోసం అడగలేదన్నారు. ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి హోదా గురించి కాకుండా అమరావతి వరకు మాత్రమే పన్ను రాయితీల్ని చంద్రబాబు అడిగారన్నారు. ఈ మూడు పార్టీల తప్పుడు రాజకీయం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తీవ్ర అన్యాయం జరిగిందని, దీనివల్ల వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర బాగా నష్టపోతున్నాయన్నారు.

పార్లమెంటు సాక్షిగా అప్పటి ప్రధానమంత్రి పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని నెరవేర్చాల్సిందేనని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిష్కరించటం చేతకాకపోతే ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఉత్తర తెలంగాణ సహా వెనకబడిన జిల్లాలకైనా ప్రత్యేక హోదా రాయితీల్ని వర్తింపచేసి యువతకు వేగంగా ఉపాధి అవకాశాలను కల్పించాలని బాబ్జీ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా కల్పించటానికి ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన పన్లేదన్నారు. “లోక్‌సత్తా ఆచరణసాధ్యంగా ప్రతిపాదించిన ‘వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా’పై నీతి ఆయోగ్ ఎందుకు ఆలోచన చేయటం లేదు? ప్రధానమంత్రి ఎందుకు పట్టించుకోవటం లేదు? వెంకయ్య నాయుడు, చంద్రబాబు నాయుడు ఎందుకు మాట్లాడటం లేదు? కాంగ్రెస్ పార్టీ ఎందుకు డిమాండ్ చేయటం లేదు?” అని భీశెట్టి బాబ్జీ ప్రశ్నించారు. ■

# హామీలు నెరవేర్చకుంటే పరిమితషాయే!

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి ఇబ్బడిముబ్బడిగా నిధుల్ని ఇస్తున్నామని, రెండేళ్లలోపే రూ.1.40 లక్షల కోట్లను వివిధ ప్రాజెక్టులు, సంస్థలకు కేటాయించామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తెలుగు గడ్డ మీద నిలబడి బహిరంగ సభల్లో చెబుతున్నారని, కేంద్రం నిధులివ్వలేదంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై స్పందించాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది. నిధులు ఇవ్వకపోతే, ఆర్థిక లోటును పూరించకపోతే చంద్రబాబు ఎందుకు అమిత్‌షాని నిలదీయటం లేదు? అని పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ ప్రశ్నించారు. తలెత్తుకుని ఆత్మగౌరవంతో కేంద్రాన్ని ప్రశ్నించలేని రీతిలో చంద్రబాబు రహస్య లావాదేవీలు సాగిస్తుండటం వల్లే కేంద్రాన్ని ప్రశ్నించలేకపోతున్నట్టు, లాలూచీపడ్డట్టు కనిపిస్తోందన్నారు.

రాష్ట్రానికి ఎంత ఆదాయం వస్తోంది, ఖర్చెంత, లోటు ఎంత మొత్తం సవివరంగా ప్రజల ముందుంచుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్వేతపత్రాన్ని ప్రకటించాలన్నారు. తెలుగువారికి జీవగర్రలాంటి బహుళార్థ సాధక పోలవరం ప్రాజెక్టుకి ఇప్పటివరకూ రూ.200 కోట్లే కేటాయించినా చంద్రబాబు స్పందించక పోవటం దారుణమన్నారు.



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు మొండి చెయ్యి చూపారని, ఇంకో ఏడాది గడిచిపోతే ఇక ఎన్నికల వాతావరణం వచ్చేసి బడ్జెట్‌లు కూడా నామమాత్రంగా మారిపోతాయన్నారు. రాజధాని అమరావతిలో భూదందాపై మంత్రి వెంకయ్య నాయుడు ఎందుకు నోరు మెదపటంలేదని ప్రశ్నించారు. తెలుగువారికి ఇచ్చిన హామీల్ని నెరవేర్చి అమిత్‌షా అప్పుడు మాట్లాడాలని, లేకుంటే ఎన్ని గొప్ప సభల్ని పెట్టినా పరిమితషాగానే మిగిలిపోతారని బాబ్జీ అన్నారు. ■

## యువతను పట్టించుకోని బడ్జెట్, చంద్రబాబు వైన్స్‌ను విస్తరిస్తూ మహిళలకు తీవ్ర అన్యాయం

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2016 అంకెల సర్కస్‌లాగా ఉందని, రాష్ట్రాభివృద్ధికి కీలకమైన యువత ఉపాధిపై ఏమాత్రం దృష్టి పెట్టలేదని భీశెట్టి బాబ్జీ అన్నారు. నిరుద్యోగ భృతి వాగ్దానం ఊసెత్తలేదన్నారు. రాష్ట్రంలో రెవిన్యూలోటును భారీగా చూపుతూ, కేంద్రం మీద ఆధారపడిన ప్రాజెక్టులను ప్రకటిస్తూ రూ.1,35,000 కోట్ల బడ్జెట్‌ను ప్రకటించారని, వీటిపై అందించే సాయం గురించి కేంద్రం ఇంతవరకూ మాటమాత్రం కూడా చెప్పలేదని అన్నారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధికి జీవధాతువులైన విద్య, ఆరోగ్య రంగాలను బడ్జెట్ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. విద్యారంగంలో పెంపు పెరిగిన ఉద్యోగులు జీతాలకే సరిపోతుందన్నారు. వైద్యరంగంలో ఏదో మార్పు తెస్తున్నట్టు ఊరిస్తూ ప్రకటనలిచ్చి చివరికి మొక్కుబడిగా చేతులు దులుపుకున్నారన్నారు. జిల్లా కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి విరుద్ధంగా మద్యం ద్వారా భారీ ఆదాయాన్ని లక్ష్యం చేసుకున్నారని, చంద్రబాబు వైన్స్ బ్రాంచీలను విస్తరిస్తూ మహిళల జీవితాల్ని కల్లోలం చేస్తున్నారని అన్నారు.

తెలుగు రాష్ట్ర శాసనసభలో తెలుగుదేశం పార్టీ ఆర్థికమంత్రి ఇంగ్లిష్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టటం తెలుగువారికి అవమానకరమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్రనేత గద్దం సతీష్‌రెడ్డి కావలిలో అన్నారు. బడ్జెట్‌లో లెక్కలు పొంతన లేకుండా ఉన్నాయని విమర్శించారు. ■

## పరిశ్రమలను తెరిపించండి, వలసల్ని ఆపండి

విజయనగరంలో అతి ముఖ్యమైన జ్యూట్, ఫెర్రో పరిశ్రమలను తెరిపించి 20వేల మంది కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని భీశెట్టి బాబ్జీ జిల్లా కలెక్టర్ ఎం.ఎం నాయక్‌ని కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశ్రమలు మూతపడి సంవత్సరం దాటిపోతున్నా పాలకులు స్పందించటం లేదన్నారు. పరిశ్రమలు లేకపోతే జిల్లాకు, రాష్ట్రానికి కూడా గడ్డు పరిస్థితులు ఏర్పడతాయని, పల్లెలు ఖాళీ అయి వలసలు మొదలవుతాయని అన్నారు. పిల్లలు చదువుకు దూరమవుతున్నారన్నారు. పక్కజిల్లా వాస్తవ్యుడు అచ్చెన్నాయుడు కార్మికమంత్రిగా ఉన్నా ఇలాంటి పరిస్థితి తలెత్తటం ఆవేదన కలిగిస్తోందని బాబ్జీ అన్నారు. ■

మహిళల్ని సమానంగా చూడటం చేతగాని మనం విశ్వగురువులమా మోదీజీ?

# 'వైవాహిక రేప్' పై మంత్రి మాట మార్చటం సిగ్గుచేటు




**భా**ర్యతో బలవంతపు సెక్స్‌ని భారత్‌లో క్రిమినల్ నేరంగా చూడలేమని కేంద్ర ప్రభుత్వం 2015 ఏప్రిల్‌లో ప్రకటించినప్పుడే లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా ఖండించింది. మహిళల కనీస మానవ హక్కుల్ని, రాజ్యాంగం వారికి అందించిన ప్రాథమిక హక్కుల్ని పరిరక్షించే బాధ్యత నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిస్సిగ్గుగా తప్పించుకుంటోందని, ప్రభుత్వపరమైన తన బాధ్యతలను నిర్వర్తించటానికి భారతీయ సంస్కృతి అవరోధంగా మారిందన్నట్టు బూటకపు వాదనను వినిపిస్తోందని ధ్వజమెత్తింది. 2015 జూన్‌లో కేంద్ర స్త్రీ, శిశు అభివృద్ధి శాఖా మంత్రి మేనకాగాంధీ కేంద్ర ప్రభుత్వ ధోరణిని ఖండించారు. బలవంతపు సెక్స్ అనేది పురుషుడి లైంగిక వాంఛ మాత్రమే కాదని, అధికారం, ఆధిపత్యం కోసం అతడు ప్రదర్శించే హింసకు అది ప్రతిరూపమని, దాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదని ఆమె స్పష్టంచేశారు.

అదే మంత్రి 2016 మార్చిలో మాటమార్చారు.

రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ, బోలెడంత పేదరికం, నిరక్షరాస్యత, వివాహం చుట్టూ అల్లుకున్న ఆచారవ్యవహారాల కారణంగా భారతదేశ పరిస్థితుల్లో వైవాహిక రేప్‌ను నేరంగా పరిగణించే చట్టాన్ని తీసుకొచ్చి అమలుచేయటం సాధ్యం కాదని మేనకాగాంధీ వివరణ ఇచ్చారు. జంతువుల పట్ల ఆదరణ, కరుణ, వాటిని హింసిస్తే సహించకూడదు అంటూ కబుర్లు చెబుతూ సంస్థలను నెలకొల్పే మంత్రి సాటి మహిళల పట్ల హింసపై మాట మార్చటం సిగ్గుచేటు.

నరేంద్ర మోదీ సర్కారు ఆలోచనల్నే అంగీకరిస్తున్నట్టు మహిళా మంత్రి పార్లమెంటులో మాట్లాడారు.

మోదీ ఆలోచనల్లో వైరుధ్యానికి, ఏకపక్ష ధోరణులకు వైవాహిక రేప్‌పై ప్రకటన ఒక నిదర్శనం. పొద్దున లేస్తే, మనదేశానికి ఎవరూ పాఠాలు చెప్పనక్కర్లేదు, మనం విశ్వగురువులం, మన సంస్కృతీసంప్రదాయాలు, కుక్కల్ని దత్తాత్రేయునిగా, చెట్లను దేవుళ్లుగా, పాముల్ని సుబ్రమణ్య స్వామిగా పూజించటం వంటి ఆచారాలతో ప్రకృతితో పెనవేసుకున్న జీవనవిధానం సాటిలేనివి అని చెప్పే మోదీ.. సాటి మనిషయిన స్త్రీ పట్ల వివక్షను, హింసను ప్రదర్శించటాన్ని మాత్రం మామూలే అన్నట్టు సమర్థిస్తారు. మన గొప్ప హైందవం వెనక ఇంత డొల్లతనం ఉండటానికి, ప్రజలకు మంచి చదువు, ఆరోగ్యం అందించకుండా దశాబ్దాలుగా వారిని అంత అజ్ఞానంలో కొనసాగించటం వెనక ఇంతటి నేరసమాన రాజకీయం ఉండటానికి, ఆ రాజకీయాన్నే కాస్త అటూఇటూగా మీరూ కొనసాగిస్తుండటానికీ ఏం సమాధానం చెబుతారు మోదీ గారూ? ఇలాంటి జీవనవిధానం ఉన్నప్పుడు విశ్వగురువులం అని చెప్పుకునే అర్హత మనకు ఎక్కడుంటుంది?

ప్రధాని, ఆయన ప్రభుత్వం ఇలాంటి డాంబికాలను ఆపి తమ భావాల్లో, ఆలోచనాతీరులో ఎన్ని వైరుధ్యాలున్నాయో ముందు గుర్తించాలి.

అత్యాచారం లేదా పరస్పర అంగీకారం లేని సెక్స్ అంటేనే హింస అని అర్థం. భారతీయ సంస్కృతిలో వివాహ వ్యవస్థ పవిత్రమైనదని, కాబట్టి భార్యాభర్తల మధ్య హింస, బలవంతపు సెక్స్‌ను నేరంగా భావించలేమని చెప్పటం విరుద్ధమైన, హాస్యాస్పదమైన వాదన. ఇది భారతదేశ ప్రతిష్ఠను ప్రభుత్వమే దిగజార్చటం. మహిళల పట్ల తమ వివక్షను కప్పిపుచ్చుకోవటానికి కేంద్ర ప్రభుత్వం భారతీయ సంస్కృతిని అడ్డం పెట్టుకుంటోందని స్పష్టంగా ఆరోపించవచ్చు.

**భారతీయ సంస్కృతిలో వివాహ వ్యవస్థ పవిత్రమైనదని, కాబట్టి భార్యాభర్తల మధ్య హింస, బలవంతపు సెక్స్‌ను నేరంగా భావించలేమని చెప్పటం విరుద్ధమైన, హాస్యాస్పదమైన వాదన.**

అలాగే, ఆత్మపరిశీలనతో దిద్దుబాటు చేసుకోవటం భారతీయ సంస్కృతిలో భాగం. జీవించు, జీవించనివ్వు అని బోధించే ఈ సంస్కృతే అనేక అసంబద్ధ చట్టాలను రద్దు చేసి సామాజిక న్యాయాన్ని పరిరక్షించే అనేక కొత్త చట్టాలను తీసుకురావటానికి దోహదం చేసింది. అత్యాచారం అనేది ఎటువంటి పరిస్థితుల్లోనైనా హేయమైనదే. వైవాహిక బంధంలో రేప్‌ని సహించాల్సిందేనంటే, మహిళలు తక్కువస్థాయి మనుషులు, వాళ్లకు తమ శరీరాల మీద, భావాల మీద ఎటువంటి హక్కూ లేదు, బాధని, హింసను సహిస్తూ పడివుండాల్సిందేనని ప్రతిరోజూ సర్కారే చెబుతున్నట్టు లెక్క. ప్రతి పౌరుడూ, మనిషీ భారత ప్రభుత్వ ఈ తీరుని నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి.

ఐదువేల ఏళ్ల పైబడిన భారతీయ సంస్కృతికి చాలా విశిష్టత ఉంది, అది మనందరం గర్వించదగ్గది, మహిళల పట్ల మనకంటే హింసను ప్రదర్శిస్తున్న అనేక దేశాలు ఇంకా మన వెనక ఉన్నాయి కాబట్టి మనం గొప్పలు చెప్పుకోవటంలో తప్పు లేదు అంటే దివాళాకోరు రాజకీయమే అవుతుంది మోదీజీ! కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన ఛాందస ధోరణి నుంచి బైటికొచ్చి వైవాహిక అత్యాచారాన్ని క్రిమినల్ నేరంగా గుర్తించాలి. భారతీయ సంప్రదాయం, సంస్కృతి, విద్య, భారతీయుల నేపథ్యం వంటి వాటి పేరుతో ఇంతకుముందున్న ప్రభుత్వాలు వరకట్నం, బాల్యవివాహాలు, వితంతువుల సహగమన నిషేధం వంటి చట్టాలను అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వంలాగే గత ప్రభుత్వాలు కూడా తామే భారతీయ సంస్కృతికి సర్వ సంరక్షకులమన్నట్టు వ్యవహరించి వుంటే, ఇక ఇటువంటి ఆటవిక సంప్రదాయాలు ఎన్నటికీ తొలగిపోయే పరిస్థితి ఈదేశంలో ఉండేది కాదు.

మహిళల్ని ప్రథమ శ్రేణి పౌరులుగా గుర్తించేందుకు, వారికి ఆత్మగౌరవం గల జీవితాన్ని, సేఫ్ అండ్ హ్యాపీగా ఉండే వివాహ వ్యవస్థను అందించేందుకు, వివక్షను తొలగించేందుకు, మంచి విద్య, ఆర్థిక స్వావలంబన వంటి చర్యలను పటిష్టంగా అమలుచేసేందుకు ఎంత త్వరగా చర్యలు తీసుకుంటే మోదీ ప్రభుత్వానికి, ఈదేశానికి కూడా అంత మంచిది. ■

# మయన్మార్ కొత్త అధ్యక్షుడిగా టిన్ క్వా, 1962 తర్వాత మయన్మార్ అధ్యక్షపీఠంపై సాధారణ పౌరుడు




ఆంగ్‌సాన్ సూచీతో మయన్మార్ కొత్త అధ్యక్షుడు టిన్ క్వా

మయన్మార్ దేశంలో చరిత్రాత్మక అధ్యాయం ఆవిష్కృతమైంది. దశాబ్దాల సైనిక పాలనకు తెరదించుతూ 1962 తర్వాత దేశ తొలి పౌర అధ్యక్షుడిని పార్లమెంటు (దిగువసభ) ఎన్నుకుంది. కొత్త అధ్యక్షుడిగా ఆంగ్ సాన్ సూచీ ప్రధాన అనుచరుడు, గతంలో ఆమెకు కారు డ్రైవర్‌గా కూడా పనిచేసిన టిన్ క్వా (69) ఎన్నికయ్యారు. ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన సైనిక మద్దతు గల రిటైర్డ్ జనరల్ మింత్ స్వే, చిన్ ప్రాంత ఎంపీ హెన్రీ వాన్ థియో సంయుక్తంగా దేశ ఉపాధ్యక్షులుగా వ్యవహరించనున్నారు. నవంబర్, 2015 పార్లమెంటు ఎన్నికల్లో సూచీ పార్టీ నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ (ఎన్ఎల్‌డీ) ఘనవిజయం సాధించింది. అయితే సైన్యం గతంలో రాజ్యాంగ నిబంధనల్ని మార్చటం వల్ల అధ్యక్ష పదవికి సూచీ అర్హత కోల్పోయారు. క్వా ఎన్నికలతో పరోక్షంగా ఆ బాధ్యతను నిర్వహించటానికి మార్గం సుగమమైంది. ■

# మహిళల ఉపాధికి, దేశ ఆదాయానికి పార్ట్ టైమ్ ఉద్యోగాల చట్టం చేయాలిప్పుడు

- తారా కృష్ణస్వామి
లోక్‌సత్తా పార్టీ జాతీయ కమిటీ ప్రతినిధి




చదువుకుంటున్నారా? ఉద్యోగం చేస్తున్నారా? మీరు ఉద్యోగం చేస్తున్నారా? హౌస్‌వైఫా? అని అమ్మాయిల్ని, మహిళల్ని తరచూ అడుగుతుంటారు. స్త్రీల పట్ల సమానత్వ భావన ఉన్న పురుషులు కూడా సమాజం కోసం వారిని ఇంటికే పరిమితం చేయటానికి మొగ్గు చూపుతున్న పరిస్థితుల్లో మనదేశంలో ఇంటి పని ఇంకా ప్రధానంగా స్త్రీపనిగానే కొనసాగుతోంది. ఉద్యోగం చేసే మహిళలు కూడా ఇంటి పని చేయకతప్పటం లేదు. ఇక ఏరకంగానైనా ఇంటికి-ఉద్యోగానికి మధ్య ఎంపిక వచ్చిందంటే, ఇంటి వద్ద బాధ్యతల్ని నెరవేర్చటం కోసం ఆకర్షణీయ ఆదాయాన్ని సైతం ఎక్కువమంది మహిళలు వదులుకుంటున్నారు. ఈ విషయంలో పురుషులకు చాలా వెసులుబాటు ఉంది. ఉద్యోగం చేయాలికాబట్టి మేం ఇంటి పని చేయలేం అంటే చాలా ఆమోదం లభిస్తుంది. చదువుకుంటూ ఉద్యోగం చేయటం విషయంలో అబ్బాయిలు, అమ్మాయిలకు తేడా లేకపోయినా, భద్రత, పురుషాధిక్యత వంటి సమాజ పరిస్థితులు ఇక్కడ అబ్బాయిలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇతరుల మీద ఆధారపడకుండా చదువుకుంటూ, కాస్త సొమ్ము వెనకేసుకుందామనుకున్న అమ్మాయిలకు ఉద్యోగాలు అంత సౌకర్యవంతంగా దొరకవు. అందుకే చదువో, ఉద్యోగమో ఏదో ఒకటే చాలామంది అమ్మాయిలు ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఒక నిర్మాణాత్మక పరిష్కారం. అదేంటంటే, సంఘటితరంగ ప్రయోజనాలు కల్పిస్తూ పార్ట్ టైమ్ ఉద్యోగాలచట్టాన్ని తీసుకురావటం. సాంకేతికత, ప్రపంచీకరణ వల్ల మహిళలు వివిధ రంగాలలోకి విస్తరిస్తూ ఎదిగేందుకు పోరాడుతున్నారు. మరోపక్క, జనాభాలో సగంగా ఉన్న వారి శక్తియుక్తుల్ని, నిబద్ధతని సక్రమంగా వినియోగించుకుంటేనే ఆర్థిక వృద్ధి రేటు వేగంగా పెరుగుతుందని అంచనాలు చెబుతున్నాయి. కాబట్టి ఎవరి మీదా యుద్ధాన్ని ప్రకటించాల్సిన అవసరం లేకుండానే, పార్ట్ టైమ్ ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తూ కార్మిక చట్టాన్ని సంస్కరిస్తే, అనేకమంది విద్యార్థినులు, చదువుకున్న నగర, చిన్న పట్టణ ప్రాంత గృహిణులు (తిరిగి) ఉద్యోగాలలోకి ప్రవేశించి అటు వ్యక్తిగత జీవితాన్ని, ఇటు సమాజహితాన్ని సంధానం చేసుకోగలుగుతారు. ఇది సామాజికంగా, ఆర్థికంగా కూడా చాలా లాభసాటి మార్పు. ఆఫీసులకే వచ్చి పనిచేయాల్సిన రోజులు కూడా మారిపోతున్నాయి. చాలా సందర్భాలలో ఇంటి వద్ద నుంచి కూడా మహిళలు తమ బాధ్యతల్ని నెరవేర్చగలరు. అలాగే దీనివల్ల ఇప్పుడు ఫుల్ టైమ్ ఉద్యోగాలు చేస్తున్న మహిళలు, పురుషులు కూడా తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోగలుగుతారు (2013 ఉద్యోగుల గణాంకాల్ని గ్రాఫ్‌లో చూడవచ్చు). ఇప్పుడు పార్ట్ టైమ్ ఉద్యోగ వ్యవస్థని ఏర్పాటు చేయటం వల్ల దేశానికి నైపుణ్యాల కొరత తీరటంతోపాటు డిమాండ్ విషయంలో ఒడిదుడుకులను ఎదుర్కొనే అసంఘటిత రంగంలోని వారికి చట్టబద్ధంగా మెరుగైన ఉపాధి అవకాశాలు దక్కుతాయి. ఎంత సమయం పని చేస్తారో అంతకు ఫుల్‌టైమ్ ఉద్యోగుల స్థాయిలో లెక్క వేసి జీతంగా చెల్లించాలి. అదేమయంలో సగం లేదా మూడోవంతు ఫుల్‌టైమర్ల కాలానికి లెక్కవేసి ఆరోగ్యం, ఇన్సూరెన్సు, రిటైర్‌మెంట్ ప్రయోజనాలు వంటివి కూడా కల్పించాలి. కొద్దిమంది మాత్రమే సంఘటితరంగంలో ఉండటం, వారు జీవితకాలం ఆ ఉద్యోగంలో కొనసాగటం, దేశంలోని మిగతావారి మేధస్సు, సృజనాత్మకత వృథాగా పోవటం, దేశ జనాభాలో అత్యధిక శాతం అసంఘటిత రంగంలో తీవ్ర అభద్రతాభావంతో బతకటం వంటి తీవ్ర సవాళ్లకు ఇది ఓ మెరుగైన పరిష్కారంగా పనిచేస్తుంది. దీనివల్ల సంస్థల యాజమాన్యానికి కూడా సమర్థులైన ఉద్యోగులు దొరుకుతారు, ఎంపిక చేసుకునే అవకాశాలు పెరుగుతాయి.

మహిళలతోపాటు పురుషులకు కూడా ఎంతో ఉపయోగపడే ఈ పార్ట్ టైమ్ ఉద్యోగాల కార్మిక చట్ట సంస్కరణ వల్ల ఉపాధి అవకాశాలు పెరగటంతోపాటు దేశానికి కూడా జీడీపీ వృద్ధి చెందుతుంది. ■

# పవర్‌స్టార్ ఈసారైనా సరైన లెక్కతో వస్తారా?



సినీ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయ పాత్రపై మళ్లీ హాట్ చర్చ మొదలైంది. మామూలుగా అయితే 2014 ఎన్నికల్లో ఎంతోకొంత ఆయన ప్రభావంతో గెలిచిన ఎంపీలు, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఆశించిన ఫలితాలను సాధించకపోగా అవినీతి ఊబిలో కూరుకుపోతుండటం, కీలక సమస్యలపై పవన్ సకాలంలో స్పందించకపోవటం, అడపాదడపా మాట్లాడినా పరిజ్ఞానం, దూరదృష్టి లేకుండా, అధికార పార్టీకే అనుకూలంగా మాట్లాడటం వంటి కారణాల వల్ల పవన్‌కు ఉన్న ఆదరణ బాగా తగ్గిపోవలసింది. సినీరంగంలో మెగాస్టార్‌గా ఉన్న చిరంజీవి పట్ల ఎంత అభిమానమున్నా ఇటువంటి కారణాల వల్లే జనాదరణ కోల్పోయారు. చిరంజీవి అవకాశవాద రాజకీయాలు కూడా అందుకు తోడయ్యాయి. కానీ పవన్ గురించి అలా లేదు. ఇంకా హాట్ చర్చే జరుగుతోంది. కారణం– ఆయనలో సమాజం కోసం ఎంతటి సొంతలాభాన్నయినా వదులుకోగలిగే అసాధారణ సాహసం ఎక్కడో దాగి ఉందని ఇంకా చాలామంది నమ్ముతున్నారు. చిన్నప్పటి నుంచీ తనలో ఉన్న ఆదర్శ భావాలను పెద్దయ్యాక, డబ్బు, పేరు పుష్కలంగా తెచ్చుకునే అవకాశాలున్న రంగంలో ఆ స్థాయిలో ఉన్నా కూడా కాపాడుకోవటం, దాన్ని చేతల్లో చూపాలనుకోవటం ఈరోజుల్లో చిన్న విషయమేమీ కాదు. కానీ రూ.100కోట్లు ఖర్చు పెట్టి గెలిచినవాళ్లకు మాత్రం ఆ ఆదర్శాలేవీ ఉండవు. వాళ్లకు పవన్ అయినా, ప్రజలైనా ఏరు దాటాక అవతల పడేసే తెప్పలే. అందుకే, 2014 ఎన్నికల్లో కొన్ని ప్రత్యేక పరిస్థితులలో కొందరి కోసం ప్రచారం చేశానని, అయితే వాళ్లు పార్లమెంటులో కనీసస్థాయిలో కూడా మాట్లాడలేకపోతున్నారని పవన్ స్వయంగా ఒప్పుకోవాల్సి వచ్చింది. కానీ తన ఆదర్శాల్ని ఆచరణలోకి తేగలిగే వ్యక్తిత్వం పవన్‌లో ఉందనే నమ్మకం ఎక్కడో ఉండబట్టే ఇంకా ఆయన్ని ప్రజలు విశ్వసిస్తున్నారు. తనలో ఉన్న ఆవేశాన్ని నిజాయతీగా వెలికితీసి ఆచరణగా మార్చగలిగే శక్తి, అందుకోసం ఎంతమంది ఎన్ని అవరోధాలను సృష్టించినా లొంగిపోకుండా అధిగమించే శక్తి ఆయకున్నాయా అనే సందేహాలున్నా జనం వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలో పవన్ తాను త్వరలో సినిమాలకు గుడ్‌బై చెప్పి కొంత డబ్బు వెనకేసుకుని పూర్తి స్థాయి రాజకీయాల లోకి రావాలనుకుంటున్నట్టు వార్తలు రావటంతో మళ్లీ చర్చ మొదలైంది. 2019 ఎన్నికలకు ఆయన రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు స్పష్టమవుతోంది. ఆయన తన 'జనసేన' పార్టీ ద్వారా వస్తారా, లేదా అనేది ఇంకా స్పష్టతలేదు. పార్టీని నడపాలంటే ఎంత కష్టమో తన సోదరుడు చిరంజీవిని చూశాక ఆయనకు వేరే చెప్పనక్కర్లేదు. సినిమాల ద్వారా చిరంజీవి కంటే ఎక్కువేమీ సంపాదించలేరు. చిరంజీవిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీజేపీ అంగీకరిస్తే ఆ పార్టీలోకి ఆయన్ని చేర్చి తాను ప్రచారం చేయాలని పవన్ యోచిస్తున్నట్టు చర్చ నడుస్తోంది. లేదంటే కొత్తపార్టీగా జనసేన తరపున చిరంజీవిని ముఖ్యమంత్రిగా ప్రాజెక్ట్ చేసి వచ్చే ఎన్నికల్లో పోటీకి దిగాలని యోచన. ఈ నేపథ్యంలో సినీ హీరోగా కాకుండా రచయితగా కొనసాగాలని కూడా పవన్ ఆకాంక్షిస్తున్నారు. పవన్‌కి పుస్తకాల పట్ల మక్కువ గురించి చెప్పనక్కర్లేదు. 2014 ఎన్నికలలో చేసిన తప్పిదాన్ని పవన్ కళ్యాణ్ ఈసారి చేయకూడదని, తన ఆదర్శాలను సాధించటానికి సరైన విధానాలు, రాజకీయ సంస్కృతి ఉన్న లోక్‌సత్తాతో కలిసి పనిచేయాలని ఆయన శ్రేయోభిలాషులు, జాతి హితైషులు కోరుకుంటున్నారు. లోక్‌సత్తాకు కావలసింది ఎంత త్వరగా వీలుంటే అంత త్వరగా ఈదేశంలో మార్పుల్ని సాధించటం, ఈ లక్ష్యసాధన ఎంత ఆలస్యమైతే దేశం రోజువారీ అంత నష్టపోతూ కోట్లమంది కన్నీరు కారుస్తుంటారు. ముఖ్యమంత్రి ఎవరన్నది లోక్‌సత్తాకు ముఖ్యం కాదు. నివారించదగ్గ బాధల్ని తొలగించి పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని వేగంగా అందించటం కోసం పవన్‌కి ముఖ్యపాత్రనిచ్చి కలిసి పనిచేయటానికి లోక్‌సత్తా సిద్ధంగానే ఉంటుంది. ■

# నిజమైన విద్య, చట్టబద్ధపాలనతోనే ఉద్యోగాలు: జేపీ

మనం కట్టే పన్నుల డబ్బుతో సమాజంలో ఉన్న సమస్యల్ని పరిష్కరిస్తే ఉపాధి లభిస్తుందని, కానీ ప్రభుత్వాలు ఆ పని చేయటం లేదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. చట్టబద్ధమైన పాలన ఉంటేనే ఉద్యోగాలు పెరిగి నిరుద్యోగులకు ఊరటలభిస్తుందన్నారు. ఎన్నికలు రాగానే కొందరు నేతలు ఉచితాలంటూ మోసం చేస్తున్నారన్నారు. రాజకీయాల్లో పదవి పాములాంటిదని, సొంత సుఖాలు వదులుకుని సమాజం కోసం పనిచేయాలని అన్నారు. కానీ ప్రస్తుతం పదవిలేకపోతే బతకలేం అనే పరిస్థితిలో ఉన్నారన్నారు. సర్పంచ్ పదవి కోసం గుంటూరు జిల్లాలో రూ. 5కోట్లు ఖర్చుపెట్టటాన్ని ఉదహరించారు. రూ. 10కోట్లతో గెలవటం ప్రజాస్వామ్యం కాదని, అందరికీ ఎదిగే అవకాశాలున్న సమాజం కోసం వ్యవస్థల్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.




నరసరావుపేట సాయితిరుమల ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల 8వ వార్షికోత్సవంలో జేపీ ముఖ్యఅతిథిగా పాల్గన్నారు. దేశంలో మార్పు యువత ద్వారానే సాధ్యమన్నారు. ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు వస్తాయనే భ్రమలో యువత ఉన్నారని, కానీ ప్రపంచంలోని ఏ దేశంలో కూడా ప్రభుత్వాలు అందరికీ ఉద్యోగాలను ఇవ్వలేవని అన్నారు. ప్రజల అవసరమే ఉపాధి అని, దేశంలో కోట్లాదిమందికి తీరని అవసరాలున్నాయని, లక్షలాది మందికి ఉపాధి అవసరమని, ఈరెంటినీ అనుసంధానం చేస్తే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. కోట్లాదిమంది అవసరాలు తీర్చే వస్తుసేవలు ముఖ్యమైనవని, అవన్నీ తయారుచేయగలిగితే ఉద్యోగాలు వాటంతటవే వస్తాయన్నారు. సాంకేతిక విద్య చదువుకున్నవారికి ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సంపాదించుకుందామని కాలాన్ని వృధా చేయకూడదన్నారు. ఉన్నత విద్య చదువుకుంటే బిడ్డలు బాగుపడతారని తల్లిదండ్రులు పడుతున్న శ్రమ అంతాఇంతా కాదు, కానీ చివరకు నిజమైన విద్య అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 3లక్షల మంది ఇంజినీర్లు ప్రతి ఏడాదీ వస్తున్నారని, వారిని సమస్యలు పరిష్కరించగలిగేవారిగా తయారుచేయలేకపోతున్నారన్నారు. నిజమైన విద్య, ఆత్మవిశ్వాసం పెంచే విద్య, ఉపాధినిచ్చే విద్య, శక్తినిచ్చే విద్య అందకపోవటం వల్ల యువతకు ఉపాధి దొరకటంలేదన్నారు. విద్యను నిస్సారంగా చేస్తున్నారన్నారు. కళాశాలల్లో కూడా కులాల పేరుతో అడ్డుగోడలు కడుతున్నారన్నారు. రాజధాని శంకుస్థాపనకు, ప్రత్యేక విమానాలకు, అధికారులకు ప్రత్యేక కార్ల కోసం వందల కోట్ల ప్రజాధనం వెదజల్లుతున్నారని, ఆ హక్కు ప్రభుత్వానికి ఎవరిచ్చారని జేపీ ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ ఛైర్మన్ పి. ఉదయభాస్కర్, ప్రాసమణి, సినీనటుడు సుదర్శన్, కళాశాల ఛైర్మన్ నలబతు వెంకట్రావు, కోశాధికారి నాగోతు శౌరయ్య, డైరెక్టర్ డా॥ రంజిత్ కుమార్, ప్రిన్సిపాల్ శివన్నారాయణ్, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ■

## యువత సామాజిక అంశాలపై స్పందించాలి



దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, సామాజిక అంశాలపై వారు స్పందిస్తుంటేనే భవితకు భరోసా ఉంటుందని జేపీ అన్నారు. శామీర్‌పేట మండలం జవహర్‌నగర్ పరిధిలోని బిట్స్ పిలానీ ప్రాంగణంలో 'పెరల్–2016' కార్యక్రమంలో మాట్లాడుతూ, రాజకీయాలను అసహ్యించుకోకుండా మార్చుకునేందుకు యువత కృషి చేయాలని జేపీ సూచించారు. సమస్యలపై అవగాహన పెంచుకుంటూ ఆలోచనను, ఆవేశాన్ని, ఆదర్శాన్ని కలగలిసి స్థానిక నాయకులుగా ఎదగాలన్నారు. దేశంలో చట్టాలను సంస్కరించాల్సి ఉందని జేపీ అన్నారు. కార్యక్రమంలో దేశంలోని వివిధ కళాశాలల విద్యార్థులు, బిట్స్ పిలానీ అధ్యాపకులు పాల్గొన్నారు. ■

గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి
పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష
పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు



**అమర్ నాయక్**
మోటర్ వెహికల్ ఇన్స్‌స్పెక్టర్
చిలకలూరిపేట

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనము నడపకండి
టూ వీలర్ నడిపేవారు విధిగా హెల్మెట్ ధరించండి
సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనము నడపకండి
మద్యం మరియు మత్తు పదార్థాలు సేవించి వాహనం నడుపకండి
ట్రాఫిక్ రూల్స్ పాటించండి - రోడ్డు ప్రమాదాలను అరికట్టండి

Space Sponsored by :
Krishna Infrastructure, NH16 Works, CHILAKALURIPET

గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి
పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష
పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

## చిన్న పిల్లల వైద్య విభాగము ప్రత్యేకతలు :

- **NICU విభాగం**
  - నెలల తక్కువ మరియు బరువు తక్కువ గల బిడ్డలకు ఇన్‌సెంటివ్‌కేర్ యూనిట్
  - రేడియంట్ వార్మర్
  - పుట్టుక కామెర్లకు ఫోటోథెరపి
- **PICU విభాగం**
  - ఆక్సిజన్ థెరఫి, నెబులైజేషన్
- **ఇమ్యునైజేషన్**
  అన్ని రకముల టీకాలు వేయబడును.

## ప్రసూతి & స్త్రీల వైద్యవిభాగము ప్రత్యేకతలు :

- 24 గం॥లు ప్రసూతి వైద్య సౌకర్యము కలదు
- లాప్రోస్కోపి (కుట్లు లేకుండా) ఆపరేషన్లు చేయబడును
- అల్ట్రాసౌండ్ స్కానింగ్ సౌకర్యము కలదు
- సంతానం లేని వారికి ప్రత్యేక చికిత్స కలదు


PICU


NICU


operation theatre


laparoscopy


ultrasound scaner

**Lahiri Hospital**
For Women and Children

Beside Sri Venkateswara Treatre,
Subhani Nagar, K.B. Road,
**CHILAKALURIPETA**
**Ph : 08647 - 259666**

Posting Date 07-04-2016

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on April 1st 2016

# గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు



పేద వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న మద్ది రామారావు



**మద్ది రామారావు**
జిల్లా ఛైర్మన్
చిలకలూరిపేట, పండరీపురం
లయన్స్‌క్లబ్



**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tullps Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad